తెలుగు దినపత్రిక

గురువారం, ఏప్రిల్ 02, 2026 | సంపుటి - 20 | సంచిక 199 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


# యుద్ధం ముగింపునకు సిద్ధమే

## షరతులు వర్తిస్తాయన్న ఇరాన్



టెహ్రాన్ : అమెరికా-ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు 2లో

### కొత్తగా పట్టాదారు నమోదు చేసుకున్న

# రైతులకు ఊరట

### వారికి కూడా రైతుభరోసాకు ప్రభుత్వం సానుకూలం

**తెలంగాణ రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ సర్కార్ భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్దిదారులకే పరిమితమైన రైతు భరోసా పథకాన్ని, కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.**



హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఇప్పటికే 62 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రైతుల అర్హత, భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం, పది రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ది పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రైతు భరోసా లబ్దిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు ఉన్నాయి.



## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

30వేల మంది టెక్కీల తొలగింపు

అందులో 12వేమంది భారతీయులు

2



2

## ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు

భారత వాతావరణశాఖ హెచ్చరిక

హైదరాబాద్ : రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదు కానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది.



### కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

# తీపి కబురు

ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం

వేలాది మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా 2లో

### మంత్రి పొంగులేటి అక్రమాలపై

## హౌజ్ కమిటీ కోరాం


- సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు
- కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం
- ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్ : రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. 2లో

# నేటి నుంచి భూభారతి అమలు

### ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం

### అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్ : తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును తరువాయి 2లో



## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర

ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత

### అడుగంటుతున్న

## జూరాల ప్రాజెక్ట్

ఆందోళనలో ఆయకట్టు రైతాంగం 2

కర్నాకటతో మాట్లాడనున్న మంత్రి ఉత్తమ్

### చేనేతలకు ఇచ్చిన ఉచిత

## విద్యుత్ హామీ అమలు

చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు

మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు

ఏటా ప్రభుత్వం 150కోట్ల భారం

వెల్లడించిన మంత్రి గొట్టిపాటి 2



### నా జీవితంలో జగన్ లాంటి

# వ్యక్తిని చూడలే

మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం విధ్వంసం

అమరావతి ఇక ప్రజారాజధాని.. ఇంచుకూడా కదలించలేరు

వింజమూరు పర్యటనలో సిఎం చంద్రబాబు 2

**రాజధానిపై ఉన్న సందిగ్ధతకు తెరపడినట్లే**

అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు హర్షం



### దోచుకోవడానికే

## అమరావతి ప్లాన్

అబద్దాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం

రాష్టానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు

కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం 2

మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్



### అమరావతి బిల్లుకు

## లోక్‌సభ ఆమోదం

సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్

చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు

- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- వైకాపా సభ్యుల వాకౌట్

న్యూఢిల్లీ : ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రక టించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. తరువాయి 2లో

# ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదపు

న్యూయార్క్ : అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఎఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

## యుద్ధం ముగింపునకు సిద్ధమే

అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.

## ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

## నా జీవితంలో జగన్ లాంటి వ్యక్తిని చూడలే

నెల్లూరు : నా జీవితంలో వైసీపీ లాంటి పార్టీని, జగన్ లాంటి వ్యక్తిని చూడలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆనందించారని మండిపడ్డారు. అమరావతి తీర్మానం రోజున వైసీపీ సభ్యులు అసెంబ్లీకి రాలేదన్నారు. అమరావతి ఏకైక ప్రజా రాజధాని అని... ఇక ఇంచు కూడా ఎవ్వరూ కదిలించలేరని స్పష్టం చేశారు. సిఎం వింజమూరులో సిఎం పర్యటించారు. వింజమూరులో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరుగుతోందని... ఆమోదం పొంది గురువారంరాజ్యసభకు వెళుతుందని సీఎం తెలిపారు. ఒకటో తేదీ వస్తే పేదలే గుర్తొస్తారని.. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 63 లక్షల మందికి ఫించన్లు ఇస్తున్నామన్నారు. ఫించన్లను మొక్కుబడిగా ఇవ్వడం లేదని... గౌరవంగా ఇంటి వద్దే ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించన్లు, తల్లికి వందనం ఇచ్చామని తెలిపారు. స్త్రీశక్తి సూపర్ సక్సెస్ అయిందని.. ఆడబిడ్డలు దర్జాగా ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి వెళుతున్నారని తెలిపారు. 'మా ఆడబిడ్డల కోసం దీపం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పీఎంజీ కనెక్షన్ తీసుకున్నా.. ఏడాదికి రూ.2,465లు సబ్సిడీ ఇస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉదయగిరికి కూడా నీరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'నాపై కోపంతో పోలవరం ప్రాజెక్ట్‌ను గోదావరిలో కలిపేశారు. గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తాం. శ్రీశైలం, పోలవరంతో ఉదయగిరి ప్రాంతానికి నీటి కొరత ఉండదు' అని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెరగడం లేదని.. అందుకే ఖ4 ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## రాజధానిపై ఉన్న సందిగ్ధతకు తెరపడినట్లే

అమరావతి : లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయని సోషల్ మీడియా ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని అన్నారు సీఎం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## నేటి నుంచి భూభారతి అమలు



జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

## మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ్ం÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైకులు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా స్జబెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.

## దోచుకోవడానికే అమరావతి ప్లాన్

అమరావతి : చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్ధాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారథి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో సానుభూతి పొందడానికే చంద్రబాబు ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని, ఆయన అసలు రంగు ప్రజలందరికీ తెలుసని జగన్ స్పష్టం చేశారు. అమరావతి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబడుతూ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాజధాని అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతిపై కీలక చర్చ జరిగే సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మావిగన్ ప్లాన్-బి అంటూ ఏపీ రాజధానిపై మరోసారి జగన్ గందరగోళ ప్రకటన చేశారు. ఏపీ కోసం ప్రాక్టికల్‌గా ఆలోచించే వారికి మాత్రమే తాను చెప్పేది అర్థమవుతుందని అన్నారు. ప్లాన్-బి ప్రకారం విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాలను కలిపి రాజధాని చేయాలని జగన్ అన్నారు. దీనికి మావిగన్ అని పేరు పెట్టాలన్నారు. అమరావతికి పెట్టే రూ.2 లక్షల కోట్లలో 10 శాతం పెడితే మావిగన్ భవిష్యత్తులో మంచి నగరం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు వైసీపీ అధినేత. రాష్ట్ర రాజధాని అనేది పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని చెప్పుకొచ్చారు.

## చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలు

అమరావతి : ఇచ్చిన హామీ మేరకు చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్అన్నారు. ఈ పథకం ద్వారా ఏటా ప్రభుత్వం రూ.150కోట్లు పైనే భరిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ జగన్ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో గాడిలో పెడుతున్నారని మంత్రి అన్నారు. 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్రలో చేనేతలకు నారా లోకేశ్ ఇచ్చిన హామీ నేటి నుంచి అమల్లోకి రానుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలు పడుతున్న కష్టాలను చూసిన లోకేశ్ వారికి ఇచ్చిన హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి చేర్చిందని తెలిపారు. జగన్ చేసిన నష్టాలను సరిదిద్దుతూనే రైతులు, చేనేతలు, ఆక్వా, సలూన్‌లకు సబ్సిడీలు ఇస్తున్నామని అన్నారు. వినూత్న ఆలోచనలతో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజెన్ విధానాలతో విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకుంటున్నామని తెలిపారు. బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి.. చరిత్రలో లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని మంత్రి రవికుమార్ తెలిపారు. ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు పెద్దఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో విద్యుత్ సంస్కరణలు ఇంతటితో ఆగేవి కాదని.. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మార్పులు తీసుకొస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.ఇదిలావుంటే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీజన్ ప్రారంభమయ్యే నాటికి మంజూరు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోవోల్టేజీ సమస్యలపై సీపీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులతో సమీక్షించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొనుగోలు వ్యయం తగ్గించుకోవడానికి పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచుకోవాలి. నియోజకవర్గానికి ఒక నమూనా సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. విద్యుత్ వినియోగదారుల సంతృప్తస్థాయిని 90 శాతానికి పెంచాలని ఆదేశించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా.. పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలని రవికుమార్ అన్నారు. 'ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లతో పాటు వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలి. ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం ఇవ్వాలి. వినియోగదారుల అనుమతితో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

హైదరాబాద్ : రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు.తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టా÷-గ్గ్ం÷ట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

## అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం



మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్

మహబూబ్‌నగర్ : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు.మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు , ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.

# అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

**నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపిలు**

**తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ**

న్యూఢిల్లీ,ఏప్రిల్1 : ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమాకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్దిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్దిలో ముందుకు సాగాలన్నారు. మోడీ అందిస్తున్న చేయత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించు కోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలనన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల మీద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబులిటీ స్టడీ చేసేందుకు రూ.40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

### తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్,ఏప్రిల్1 : ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

## మృత్యువులా దూసుకొచ్చిన కారు

**నేడు వివాహ నిశ్చితార్థం...అంతలోనే రోడ్డు ప్రమాదం**

**ప్రమాదంలో యువకుడు మృతి**

ఖమ్మం,ఏప్రిల్1 : జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ

ఒంగోలు,ఏప్రిల్1 : ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెంలో మంగళవారం అర్ధరాత్రి రెండు విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ల సామాగ్రి చోరీకి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సీహెచ్ మంగమ్మ, షరీఫ్ పొలాలలో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేశారు. వాటిలో విలువైన రాగి తీగ, ఇంధనం, తదితర సామాగ్రి చోరీ చేసి పరారయ్యారు.

# రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

### హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క



న్యూఢిల్లీ,ఏప్రిల్1 : గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

**16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు**

**వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ**

న్యూఢిల్లీ : దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

## దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న కూటములు

**రెండు కూటములను సాగనంపండి**

**కేరళ ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ పిలుపు**

తిరువనంతపురం,ఏప్రిల్1 : కేరళంలోని కష్టజీవులు, నిజాయతీపరులైన ప్రజలను దశాబ్దాలుగా లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, యునైటెడ్ డెమోక్రటక్ ఫ్రంట్‌లు వంచిస్తున్నాయని, రెండు కూటమిల్లో ఎవరో ఒకరిని ఎంచుకోవడం కాకుండా రెండింటినీ ఇంటికి సాగనంపాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరవూర్ నియోజకవర్గంలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ జెండాలు, గుర్తులు వేరైనప్పటికీ వాటి ప్రవర్తన, క్యారెక్టర్ ఒకటేనని చెప్పారు. ఆలోచనా ధోరణి కూడా ఒకటేనన్నారు. సమాజాన్ని విడగొట్టడం, కేరళం ఆర్థిక వ్యవస్థను పతనం చేయడం కోసం పనిచేస్తుంటాయని విమర్శించారు. ఎల్డీఎఫ్ అంటే లూటీలు, విభజనలు, వైఫల్యం(లూట్, డివిజన్, ఫెయిల్యూర్) అని రాజ్‌నాథ్ నిర్వచించారు. యూడీఎఫ్‌ను నమ్మదగని, నిజాయతీలేని, మోసపూరితమైనది(అన్‌ట్రస్ట్‌వర్తీ, డిసానెస్టీ, ఫ్రాడ్)గా రాజ్‌నాథ్ అభివర్ణించారు. రెండిట్లోనూ 'ఎఫ్' అనేది కామన్ అనీ, 'ఫ్రంట్' అంటే కరప్షన్ అని ఘాటుగా విమర్శించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఈ సారి కేరళం ఎన్నికల్లో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌కు గట్టి సవాల్ విసిరేందుకు ప్రచారం ముమ్మరం చేస్తోంది. సీపీఎం సారథ్యంలోని ఎల్డీఎఫ్ దశాబ్ద కాలంగా అధికారంలో ఉంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సారథ్యంలో ఎల్డీఎఫ్ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు పట్టుదలగా ఉంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పినరయి విజయన్ వైఫల్యాలను ఎండగడుతూ ఈ సారి 100 సీట్లలో తమ గెలుపు ఖాయమంటూ ప్రచారం సాగిస్తోంది. కాగా, బీజేపీ ఓట్ షేర్ కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగిందని, ఓటర్లు ఇప్పుడు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని ఎన్డీయే అభ్యర్థి అనూప్ ఆంటోని తెలిపారు. కాగా, కేరళం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం

**ఉచిత విద్యుత్‌తో తీరనున్న కష్టాలు**

**ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పోస్ట్**

అమరావతి,ఏప్రిల్1 : ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా చిన్న చేనేత కుటుంబాలకు ఉపశమనం కలిగించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇవాళ్టి నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకం చేనేత రంగానికి బలాన్నిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత మగ్గాలు, 11,488 పవర్ లూమ్ యూనిట్లు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి వ్యయం తగ్గి, చేనేత కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కలగనుందని నిపుణులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ తన సందేశంలో గతాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. 2017లో నేతన్నలు తమ సమస్యలు వివరించినప్పుడు తనకు తీవ్రంగా బాధ కలిగిందని తెలిపారు. అప్పటినుంచే చేనేత రంగానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నానని, చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించానని చెప్పారు. వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలని ఇచ్చిన పిలుపు యువతలో మంచి స్పందన తెచ్చిందని పేర్కొన్నారు. అలాగే నివార్ తుపాను సమయంలో వెంకటగిరి ప్రాంతంలో చేనేత మగ్గాలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా చూసి బాధపడ్డానని, అప్పుడు ఇచ్చిన భరోసాను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత 21 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ది పొందబోతున్న ప్రతి చేనేత కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## చేనేతరంగానికి ఉచిత విద్యుత్

**ఇంటింటా కరపత్రాలు పంచిన మంత్రి అనిత**

అనకాపల్లి,ఏప్రిల్1 : పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పర్యటించారు. ఈరోజు(బుధవారం) ఉదయం నక్కపల్లి చేరుకున్న మంత్రికి మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నక్కపల్లిలో ఇంటింటికి వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. నేతన్న జీవితాల్లో సరికొత్త వెలుగులంటూ కరపత్రాలు పంచుతూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా అందిస్తున్నామంటూ చేనేత కార్మికులకు తెలియజేశారు.

## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

**3వేల మందితో పోలీస్ బందోబస్తు**

హైదరాబాద్,ఏప్రిల్1 : నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కొండగట్టు ఆలయంలో అపశృతి

**చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు**

జగిత్యాల,ఏప్రిల్1 : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

## మూడుముక్కలాటతో అమరావతికి ద్రోహం

**జగన్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి పెమ్మసాని**

న్యూఢిల్లీ,ఏప్రిల్1 : అమరావతి అంటే తనకు ఎమోషన్ అని.. అందుకే తెలుగులో మాట్లాడతున్నాని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. లోక్‌సభలో అమరావతి బిల్లుపై చర్చలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. బిల్లుపై మాట్లాడటం అమరావతి బిడ్డగా గర్విస్తున్నట్లు తెలిపారు. అమరావతి రైతులకు, మహిళలకు కేంద్రమంత్రి అభినందనలు తెలియజేశారు. రూపాయి ఖర్చు లేకుండా వేల ఎకరాలు అమరావతి కోసం సమీకరించిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబుపై ప్రజలు పెట్టుకున్న నమ్మకమే అమరావతి అని వెల్లడించారు. అధికార వికేంద్రీకరణ పేరుతో వైసీపీ మూడు ముక్కలాట ఆడిందని కేంద్ర మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల విలువైన కాలాన్ని వృథా చేసిందన్నారు. ఏపీకి రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితిని వైసీపీ సృష్టించిందని మండిపడ్డారు. రైతుల కన్నీళ్లే ఈ చట్టానికి పునాదిగా మారాయన్నారు. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత్వం ఉంటే పెట్టుబడులు రావని తెలిపారు. రాజధాని నిర్ణయం.. మార్పు.. కేంద్రం పరిధిలోనే ఉంటుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాజధాని లేకుండా ఇన్నేళ్లు రాష్ట్రం గడిపిందన్నారు. చంద్రబాబు ప్రతిపాదించిన అమరావతిని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టి మూడుముక్కలాట ఆడిందన్నారు. ఇందువల్ల వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేశారని అన్నారు. ఓ రకంగా ఇది సుదినమని అన్నారు.

## మంగళ్‌హాట్ గోదాముపై దాడి

**హోటళ్లకు చచ్చిన మేకల మాంసం**

**కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం**

హైదరాబాద్,ఏప్రిల్1 : హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

**29మంది దుర్మరణం చెందినట్లు ధృవీకరణ**

మాస్కో : క్రిమియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రష్యాకు చెందిన సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది దుర్మరణం చెందారు. ఆంటోనోవ్- 26 మోడల్‌కు చెందిన విమానం స్థానిక కాలమాన ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటలకు క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తోంది. అదే సమయంలో ఆ విమానానికి రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అయితే ఆ విమానం ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా.. వారందరూ మృతిచెందారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసింది. విమానంపై దాడి జరిగింది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ప్రమాదానికి గురైన ఆంటోనోవ్ ఎన్- 26 విమానాలను 1960 చివరలో ప్రవేశపెట్టారు. వీటని సైనిక అవసరాలతో పాటు సరుకు రవాణాకు ఉపయోగిస్తుంటారు.

# సంపాదకీయం

## ట్రంప్ చిత్తిమంటల్లో ప్రపంచం విలవిల!

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమరు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావం తులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు.

# కమలం ఎత్తులు.. కసరత్తులు



ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీలలో అసోంలో మాత్రమే బిజెపి సొంతంగా అధికారంలో ఉంది. పుదుచ్చేరిలో అధికార కూటమిలో భాగస్వామి అయినప్పటికీ అక్కడ సొంతబలంపై నిలబడే అవకాశం లేదు. అసోంలో అధికారం నిలబెట్టుకొని, వరుసగా మూడోసారి అధికారం పొందేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుండగా, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో మొదటిసారి ఏదిఏమైనప్పటికీ అధికారం చేపట్టాలని బిజెపి నాయకత్వం పట్టుదలతో పనిచేస్తున్నది. తమిళనాడు, కేరళలలో సైతం సొంతంగా అధికారం ఇప్పట్లో సాధ్యమయ్యే అవకాశం లేకపోవడంతో తన ప్రాబల్యం ఆ రాష్ట్రాలలో పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. అయితే, బిజెపి నాయకత్వం ప్రస్తుతం తన దృష్టిని రాజకీయ ప్రత్యర్థులపైకన్నా సొంతపార్టీ నేతలు కలిసికట్టుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనే విధంగా చేయడంపైనే సారించాల్సి వస్తుంది. ఈ రాష్ట్రాలలో దశాబ్దాలనుండి సమీప భవిష్యత్తులో అధికారం దక్కే అవకాశాలు కనిపించకపోయినా పార్టీకోసం పనిచేస్తున్న నాయకులు, కొత్తగా పార్టీలో చేరి పెత్తనం చేస్తున్న నాయకుల మధ్య ఘర్షణలు అనివార్యంగా కనిపిస్తున్నాయి. కష్టజీవుల జీవితాల్లో ఆశాకిరణం నాలుగు రాష్ట్రాలలో కూడా పార్టీకి నేతృత్వం వహిస్తున్నది కొద్దికాలం క్రితం పార్టీలో చేరిన నాయకులే కావడం గమనార్హం. అసోంలో పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. అక్కడ ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ చుట్టూ పార్టీ తిరగాల్సి వస్తుంది. ఇక్కడ ఎన్నికలు జరుగుతుంది బిజెపి- కాంగ్రెస్ మధ్య కాదని, శర్మ నేతృత్వంలోని బిజెపి, తరుణ్ గొగోయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ మధ్య అంటూ రాజకీయ వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. తనను బిజెపిలోకి తీసుకొచ్చిన నాయకుడితో సహా దశాబ్దాలుగా పార్టీకోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందిన 15 మంది సిట్టింగ్ ఎంఎల్ఎలకు ఈ సారి బిజెపి సీట్లు లభించలేదు. పైగా, ఇటీవల పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులను అందలం ఎక్కిస్తున్నారు. 36 మంది కాంగ్రెస్ నాయకులు బిజెపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. దానితో ఓ మహిళా మంత్రితో సహా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఓ సీనియర్ బిజెపి నేత స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. పదేళ్లుగా అధికారంలో ఉండడంతో అవినీతి, నిరుద్యోగం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎక్కువగా గౌహతి చుట్టూ కేంద్రీకృతం అవుతుందనే విమర్శలు సైతం కొన్ని ప్రాంతాలలో సమస్యలు సృష్టిస్తున్నాయి. దేశం మొత్తం బిజెపి కేంద్ర హోం మంత్రి అమిత్ షా కనుసన్నలలో బిజెపి నడుస్తుండగా, అసోంలో మాత్రం సిఎం శర్మ 'సూపర్ బాస్'గా వ్యవహరిస్తున్నారు. కేంద్ర నాయకులు సైతం జోక్యం చేసుకోలేని పరిస్థితులు ఏర్పరచుకున్నారు. ఇక పశ్చిమబెంగాల్‌లో సైతం ఒకప్పుడు ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి కుడిభుజంగా వ్యవహరించిన ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఆధిపత్యం కొనసాగుతోంది. ఇక్కడ సైతం పార్టీ సీనియర్ నాయకులు పలువురికి సీట్లు లభించకపోవడంతో పలు చోట్ల పార్టీ కార్యాలయాలపై దాడులు జరిగాయి. విధ్వంసం దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పార్టీ సీట్లను అమ్ముకున్నారని అంటూ సీనియర్ నాయకులపై బహిరంగంగానే ఆరోపణలు చేయడంతో పార్టీని ఇరకాటంలోకి నెట్టివేసి పరిస్థితులు నెలకొన్నాయి. మరిన్ని కనుగొనండి ఆటోమొబైల్స్ క్రీడా సామగ్రి తెలంగాణ వార్తలు ాాశ్రీంశీ =ఋం - ఇది ఆదర్శమే కాదు అవసరమే ాాంజవతీఅంవఎవత్ ఎస్ఐఆర్ పేరుతో లక్షలాది ఓట్లు తొలగించామని, ఇక తమను అధికారంలోకి తీసుకురాకుండా ఎవ్వరూ అడ్డుకోలేరని ధీమాతో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో పార్టీకి నమ్మకస్తుడైన గవర్నర్ ఆర్ఎన్ రవిని తమిళనాడు నుండి ప్రత్యేకంగా ఇక్కడకు తీసుకొచ్చి, ఎన్నికల ప్రకటన రాగానే రెవెన్యూ, పోలీసు అధికారులను భారీగా మార్చివేశారు. ప్రజలను గెల్చుకోవడం ద్వారా కాకుండా అధికార యంత్రంగం ద్వారా అధికారంలోకి రావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరే రాష్ట్రంలో లేని విధంగా ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వం నుండి తీవ్ర ప్రతిఘటనలను ఎదుర్కొన్నది. సుప్రీం కోర్టు జోక్యంకు కూడా దారితీసింది. ఎన్నికల కమిషన్‌పై మమత ప్రభుత్వం చేస్తున్న తీవ్రమైన ఆరోపణలకు స్థానిక బిజెపికి నేతల నుండి ఎక్కువగా సమాధానాలవుతున్నాయి. బంగ్లాదేశ్ నుండి అక్రమ వలసలను ఆమె ప్రోత్సహిస్తూ, వారిని ఓటర్లుగా మార్చుకున్నారని, వారి పేర్లు తొలగించే ప్రయత్నంతోనే ఆమె ఆడుకుంటున్నారని ప్రచారం ప్రారంభించారు. గత ఏడాది బీహార్‌లో సైతం ఇటువంటి ప్రచారమే చేశారు. విదేశీ ఓటర్లను తొలగిస్తుంటే ఆర్‌జెడి అడ్డుకుంటుందని ప్రచారం చేశారు. అయితే, ఎంతమంది విదేశీ ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించారంటే సమాధానం లేదు. కేవలం 230 మందిని మాత్రమే తొలగించారని, వారు సైతం నేపాల్ నుండి వివాహబంధం కారణంగా బీహార్‌కు వచ్చినవారిని చివరకు తేలింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారమే ఇప్పటివరకు బెంగాల్‌లో గుర్తించిన బంగ్లాదేశ్ పౌరుల సంఖ్య బిజెపి పాలిత త్రిపురతో పోల్చుకుంటే నామమాత్రంగా ఉంది. ఈ సందర్భంగా అమిత్ షా టిఎంసి పాలనపై ఓ ఛార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. అయితే తనను 'బెంగాల్ కుమార్తె'ను అంటూ చెప్పుకుంటున్న మమతా బెనర్జీని ఎదుర్కోవడంలో బలమైన నాయకత్వం బిజెపిలో కనిపించడం లేదు. స్టార్ హోటల్స్ నుండి ఎన్నికల ప్రచారం నిర్వహించడం కాకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితులను సర్దుబాటు చేసుకుని, పార్టీ పాత- కొత్త నాయకుల మధ్య సయోధ్య కుదర్చడం ఓ పెద్ద సవాల్‌గా కనిపిస్తుంది. మరోవంక, తమిళనాడులో బిజెపి అస్తిత్వ సమస్యలు ఎదుర్కొంటున్నది. డిఎంకె వ్యతిరేక శక్తులు అన్నింటినీ ఎన్‌డిఎ పరిధిలోకి తీసుకొచ్చి ఎంకె స్టాలిన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలనే ప్రయత్నాలు ఎన్నికల ముందే వికటించాయి. అందుకనే ఆ రాష్ట్రం ఎన్నికలపై పెద్దగా ఆశలు కనిపించక పోవడంతో అక్కడి గవర్నర్ రవిని ఎన్నికలు జరుగుతున్న మరో రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌కు మార్చారు. బలవంతంతో బిజెపితో సీట్ల సర్దుబాటుకు అన్నాడిఎంకె అధినేత కె పళనిస్వామిని ఒప్పంచగలిగినా అందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. బిజెపి ఎంతగా ఒత్తిడులు తీసుకొచ్చినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీరుసెల్వం, శశికళ వంటి వారిని ఎన్‌డిఎ పరిధిలోకి తీసుకువచ్చేందుకు పళనిస్వామి ఒప్పుకోలేదు. దానితో గత్యంతరంలేక పన్నీరుసెల్వం డిఎంకెలో చేరిపోయారు. శశికళ సొంతదారి చూసుకున్నారు. పన్నీరుసెల్వంతో పొత్తుకోసం తమిళనాడులో బిజెపిని ఉధృతమైన రాజకీయ శక్తిగా మార్చే ప్రయత్నం చేస్తున్న మాజీ ఐపిఎస్ అధికారి అన్నామలైను పక్కనపెట్టాల్సి వచ్చింది. దానితో తండ్రి అనారోగ్యం అంటూ ఎన్నికల ప్రచారంకు దూరంగా ఉంటున్నారు. చివరకు ఎన్నికల పొత్తులో అన్నామలై పోటీ చేసేందుకు సీట్ కూడా దొరికే పరిస్థితి లేదు. సీట్ల సర్దుబాటులో సైతం ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా కాకుండా పళనిస్వామి తెలివిగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు గెలిచే అవకాశాలు లేని సీట్లను ఎక్కువగా బిజెపికి వదిలారనే అన్నామలై మద్దతుదారులు విమర్శలు గుప్పిస్తున్నారు.

## ఒంటిమిట్టలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

### శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండరాముడు



ఒంటిమిట్ట,ఏప్రిల్1 : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండ రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.స్వయంవరం సమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధనుర్భంగాలంకారం. సీతారాముల కల్యాణం రోజున ఉదయం ఈ అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఇకపోతే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుండి వాహనసేవ వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారి ని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు నిత్యవాహనం. దాసుడుగా, సఖుడుగా, విసనకఱ్ఱగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, వాహనంగా ధ్వజంగా అనేక విధాల సేవలందిస్తున్న నిత్యసూరులలో అగ్రగణ్యుడైన వైనతేయుడు కోదండరామస్వామిని వహించి కదిలే తీరు సందర్శనీయమైనది. 108 దివ్య దేశాలలోనూ గరుడసేవ విశిష్టమైనది.


## అదృశ్యమైన మహిళ దారుణ హత్య

### అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిత్తూరు,ఏప్రిల్1 : పెద్దపంజాని మండల కేంద్రానికి చెందిన చంద్రమ్మ(35) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. చంద్రమ్మ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి మహిళ కోసం గాలించగా.. పలమనేరు రూరల్ మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో చంద్రమ్మ మృతదేహం లభ్యమైంది. నగదు లావాదేవీలు కారణంగా ఈ హత్య జరిగినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా గత కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది చంద్రమ్మ. పెద్దపంజానిలో టైలరింగ్ పని చేస్తూ చిట్టీల వ్యాపార లావాదేవీలు కొనసాగించేది. చంద్రమ్మ కనబడడం లేదని ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో ఆమె హత్య విషయం వెలుగులోకి వచ్చింది. చంద్రమ్మ హత్య స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

## ధ్యానయోగం.. దైవమార్గం

ఆలోచనా ప్రవాహాన్ని ఒక ప్రత్యేకమైన వస్తువు మీద గానీ, ఒక భావం మీద గానీ,అవిచ్ఛిన్నమైన తైలధారగా స్థిరంగా ఉంచగలిగితే దానిని 'ధ్యానం' అంటారు.ధ్యానమంటే మనసు లోతును కొలిచే సాధనంగా నిర్వచిస్తారు తాత్త్వికులు. ఆలోచనల వెనుక అంతర్నిహితంగా దాగిఉన్న శక్తిని పరిశీలించటమే ధ్యాన లక్ష్యం. మరి ఈ ఆలోచనల వెనుక ఉన్నది ఏమిటి? అసలు ఎటువంటి ఆలోచనలు లేని మనసును ఊహించగలమా? ఎప్పుడూ మంచి చెడులు, తప్పు ఒప్పులనే పరస్పర విరుద్ధాలైన ద్వంద్వాల చుట్టూ పరిభ్ర మించే ఈ మనసు వెనుక ఉన్నది ఏమిటి? మనసును శోధించటం ద్వారా ఆలోచనలను పరిష్కరించటం, సమాధానపరచటం.. ఇదే ధ్యానం. క్రమక్రమంగా ధ్యానంలో పురోగమిస్తూ ఉన్నత స్థాయిని అందుకున్నప్పుడు ఈ మనసు మనం అనుకున్నంత చెడ్డదేమీ కాదని అవగతమవుతుంది. ధ్యానం సిద్ధించినప్పుడు మనసు నుంచి విషయవాసనలన్నీ తొలగిపోతాయి. అప్పుడు మనసు శుద్ధమై ఆధ్యాత్మిక పరిధిలోకి వస్తుంది. 'ధ్యానం చేసేవారికి దేహాభిమానం తొలగుతుంది. భగవంతుని సాక్షాత్కారం కలుగుతుంది. ఈ జన్మలోనే ముక్తిని పొందుతారు' అంటోంది వేదాంత పంచదశి. హృదయంలో బొటనవేలు పరిమాణంలో ఆత్మ ఉందని కఠోపనిషత్తు చెబుతుంది. నిరాకార నిర్గుణ పరమాత్మ ధ్యానం ఈ హృదయంలో చేయాలి. ఈ హృదయాకాశంలో జ్యోతిని పరమాత్మగానూ, ఆ జ్యోతి మధ్యలో ఉన్న చిన్న జ్యోతిని తన ఆత్మగానూ ధ్యానించాలని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు. అలాంటి మహాత్ములు ఆత్మ, పరమాత్మలు ఒకటని చెప్పారు. అందుకే ఏకత్వాన్ని ధ్యానించాలి. హృదయాకాశంలో ద్వాదశ దళాల కమలంపై ఇష్టదేవత చిన్మయమూర్తి ఆసీనుడై ఉన్నట్లుగా భావించి ధ్యానించాలి.



ఆధ్యాత్మికం

# సౌకర్యాల కల్పన మాది సహకరించాల్సిన భాధ్యత మీది

## ● ప్రజలను కోరిన రామగుండం మేయర్ మహంకాళి స్వామి







**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నగర పాలక సంస్థ తరపున ప్రజలకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తామని,ప్రజలు కూడా తమ వంతు భాధ్యతగా చెత్త బయట పడవేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. వార్డు బాటలో భాగంగా బుధవారం రామగుండం నగర పాలక సంస్థ మూడవ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ , వినాయక నగర్, దొడ్డి కొమురయ్య నగర్, శ్రీ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ వడ్లూరి రవి , అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. కార్పొరేటర్ తో పాటు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ అధికారులు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి జి సి బి , చైన్ జి సి బి , బాబ్ కాట్ యంత్రాలతో పెద్ద మురుగు నీటి కాలువలో పూడిక తొలగించారు. మేయర్ కాలువ గట్టు పై నుండి అధికారులకు ,సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. పని పూర్తయిన తరువాతనే అక్కడి నుండి వెళ్లాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నగర పాలక సంస్థ , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ , ట్రాన్స్ కో తదితర ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి వాడ వాడలా తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. తమ ఇంటి ముందు వీధి దీపాలు వెలగడం లేదని చెప్పిన వెంటనే అప్పటికప్పుడే అక్కడిక్కడే వీధి దీపాలు పెట్టించారు. సుమారు 10 వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. తమ డివిజన్ కు మంచి నీళ్ళు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా వెంటనే చర్య తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని అన్నారు. ఇండ్ల మీద వేలాడుతున్న కరెంట్ తీగలను సవరించాలని ట్రాన్స్ కో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనులు నిర్వహించడంలో అధికారులకు సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. స్థానికంగా ఉన్న హోటళ్ల నిర్వాహకులు కాలువల్లో చెత్త పడవేస్తున్నారని ఫిర్యాదు చేయగా తక్షణమే వారికి నోటీసులు అందజేసి జరిమానా విధించాలని ఆదేశించారు. రోడ్ల మీద, కాలువల్లో చెత్త వేసినా వాటిని ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కాగా తమ డివిజన్ లో పర్యటిస్తున్న సంధర్భంగా కాలనీ వాసులు ఆయనకు ఘనంగా స్వాగతం పలుకుతూ శాలువాలు, బొకే లకు బదులుగా నోటు పుస్తకాలు, విద్యార్థులకు ఉపకరించే వస్తువులను అందజేయడంతో వారిని ఆయన అభినందించారు. స్థానిక కార్పొరేటర్ వడ్లూరి రవి, స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు, ప్రశాంత్ నగర్ పెద్ద మనుషులు, శ్రీ నగర్ కాలనీ వైభవ్ టవర్స్ తరపున వెంకట్రావ్ , కాలనీ వాసులు భూపెల్లి శ్రీనివాస్ రావు, శ్రీ నగర వెల్ఫేర్ అసిసియేషన్ తరపున ప్రభాకర్ రావు, మాజీ ఆర్ పి త్రివేణి, కె వి ఆర్ వెజిటేబుల్స్ తరపున పది లాంగ్ నోట్ పుస్తకాలు వేర్వేరుగా అందజేయగా వినాయక నగర్ కాలనీ వాసుల తరపున నరేందర్ కలర్ చాక్ పీసులు మేయర్ కు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర, ఇ ఇ పి వి రామన్, డి ఇ ఇ లు అఫ్తాబ్, జగదీష్ , షాభాజ్, ఎ ఇ లు జమీల్, మీర్, మనోజ్, చంద్ర మౌళి, రాంజీ, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు మౌనిక , కిషోర్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్ లు నాగ భూషణం ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేయడమే లక్ష్యం


## ● యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్ ● ఈ నెల 15న పెద్దపల్లిలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పెద్దపల్లి అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం బొంకూరి అవినాష్‌తో పాటు యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి అసెంబ్లీ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి త్వరలోనే గ్రామ, మండల, అసెంబ్లీ కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావును కోరినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు మత్తు వదలండి – మైదానంలోకి రండి అనే నినాదంతో ఈనెల 15న పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలోని క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గుమ్మడి ప్రసాద్, పిరంగి రాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎంచర్ల తిరుమలేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆయుభ్, కార్యదర్శులు అభినయ్ గౌడ్, కొడపత్రి మధుకర్, పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రవణ్, మండల అధ్యక్షులు జడల రాజు, సిరిసెటి రాహుల్, ఒర్రె అజయ్ యాదవ్, దేవేందర్ రెడ్డి, నాయకులు అరగొండ రాజ్ కుమార్, వెలిశాల రాకేష్, రాకేష్ యాదవ్, గుర్రాల వాసు, స్వామి రాజ్ యాదవ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్దారణ పూర్తి

## ● జనగణన 2027 పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్దారణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం జనగణన 2027 పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జనగణన 2027 రెండు దశలలో జరుగుతుందని, ప్రస్తుత సంవత్సరం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం మే 10 నుంచి ప్రారంభం అవుతుందని, ప్రతి ఇంటికి సంబంధించి 35 ప్రశ్నల వివరాలు నెల రోజుల వ్యవధిలో సేకరించాలని కలెక్టర్ తెలిపారు.ఫిబ్రవరి 2027 లో హౌస్ లిస్టింగ్ ప్రకారం జనాభా వివరాల సేకరణ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి 300 ఇండ్లు/800 జనాభా ఒక బ్లాక్ గా (హెచ్.ఎల్.బీ) నిర్దేశించి జనాభా లెక్కల చేసేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫీల్డ్ సర్వే సమయంలో మనం వేసుకునే అంచనా కంటే ఎక్కువ ఇండ్లు ఉండే అవకాశం ఉన్నందున 15 శాతం అధికంగా ఎన్యుమరేటర్లు నియామకం చేపట్టాలని అన్నారు.పట్టణ ప్రాంతాలలో హెచ్.ఎల్.బీ లు మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు చేయనున్న హెచ్.ఎల్.బీ. పేపర్ మీద రిపోర్ట్ సిద్దం చేసుకొని ఆన్ లైన్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హెచ్.ఎల్.బీ పరిధిలో ఉన్న ఇండ్లు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఆట స్థలాలు, ఆసుపత్రులు ఏం ఉన్నాయో సరిగ్గా ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. హెచ్.ఎల్.బీ ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేసుకోగలిగితే రాబోయే 1.5 సంవత్సరాల కాలం పాటు జనాభా లెక్కల కార్యక్రమం అంత ప్రశాంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్.ఎల్.బీ విభజన రాబోయే 10 రోజులలో తహసిల్దారులు స్థానిక పంచాయతీ కార్యదర్శి మున్సిపల్ కమిషనర్లు సహకారంతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 200 నుంచి 300 ఇండ్లు ఉన్న చిన్న చిన్న గ్రామ పంచాయతీలు, వార్డుల హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 15 లోపు తుది హెచ్.ఎల్.బీ నిర్దారణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. జనగణన 2027 కార్యక్రమం చాలా ముఖ్యమైన అంశమని, దీనిని ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.హౌస్ లిస్టింగ్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 1400 ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశామని, ప్రతి గ్రామం మున్సిపాలిటీ పరిధిలో ఎంతమంది ఎన్యుమరేటర్ అవసరం ఉన్నారో వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి. గంగయ్య, సురేష్, ఎంపీడీవోలు, తహసిల్దారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ నగర్‌లో "నేచురిక్స్ ఐస్ క్రీమ్స్" కేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు






**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని భగత్ నగర్ అద్విత ఇండోర్ నేషనల్ స్కూల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన "నేచురిక్స్ ఐస్ క్రీమ్స్" విక్రయ కేంద్రాన్ని బుధవారం కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్-రేణుక దంపతులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ నగర ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఐస్ క్రీమ్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానికంగా ఇటువంటి వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని, నేచురిక్స్ ఐస్‌క్రీమ్స్ సంస్థ మరిన్ని శాఖలతో విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలోనిర్వాహకులు, స్థానిక నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.

# అకాల వర్ష బీభత్సం..

## వ్యర్థాలతో నిండిన మురికి కాలువలు..

- డ్రైనేజీల్లో ప్లాస్టిక్ శాపం.. రోడ్ల పైనే వర్షపు నీటి ప్రవాహం!...
- పాదాచారులకు తప్పని కష్టాలు





**జగిత్యాల, కొడిమ్యాల (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండల కేంద్రంలోని నేడు ఉదయం కురిసిన అకాల వర్షం కారణంగా గ్రామంలోని డ్రైనేజీలు నిండిపోయి నీరు రోడ్లపైకి చేరినని. మురుగునీరు.. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రైనేజీలే కారణం అంటున్నారు స్థానికులు. అకాల వర్షం స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో మురుగు కాలువలు (మూర్లల్లో) నిండిపోయి, ప్రవాహం రోడ్లపైకి ఉప్పొంగడం తో: ప్లాస్టిక్ వ్యర్థాల అడ్డంకి: మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలను వేయడం వల్ల నీరు వెళ్లే మార్గం మూసుకు పోయింది. రోడ్లపై ప్రవాహం: డ్రైనేజీలు బ్లాక్ అవ్వడంతో వర్షపు నీరు అంగడి బజార్ చౌరస్తాలో రోడ్ల పైనే చెరువును తలపించేలా ప్రవహించింది. రహదారులపై భారీగా నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాల ముందు నీరునిలిచిపోవడంతో పనులు స్తంభించాయి.దీంతో గ్రామపంచాయతీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు., అధికారులు, ప్రతినిధులు తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయాలని, ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించి నిబంధనలు కఠినతరం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం రాకముందే డ్రైనేజీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, పూడికను తొలగించకపోతే భవిష్యత్తులో మరింత ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హనుమాన్ ధీక్ష స్వాముల సందడి



**కూకట్‌పల్లి ఏప్రిల్ 01 (ది క్రైమ్ న్యూస్):** కూకట్ పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ పాపిరెడ్డినగర్ లోని వీరాంజనేయ శివాలయంలో హనుమాన్ దీక్ష స్వాముల సందడి మొదలైంది. పీఠాధిపతులు దుర్గాప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు మండల దీక్షలు చేపట్టారు. శంకర్ గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ మాల, దీక్ష స్వాముల కోసం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాములు పెద్ద ఎత్తున హాజరై శ్రీరామ, హనుమాన్ భక్తి పాటలతో భజన అనంతరం అన్న ప్రసాదాలు స్వీకరించారు.

# ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టు పార్టీకి వెన్నుదన్నుగా నిలబడి ఆర్థిక సహాయాన్ని అందించాలి

**● వందేళ్లుగా సిపిఐ ప్రజల కోసమే ఉద్యమాలు నిర్వహిస్తుంది: సిపిఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**






**కరీంనగర్ టౌన్, ఏప్రిల్1(ది క్రైమ్ న్యూస్):** సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని అలాంటి పార్టీకి ప్రజలే వెన్ను దన్నుగా నిలవాలని వందేళ్లుగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న సిపిఐ కి విరివిగా ఆర్థిక సహాయాన్ని అందించాలని సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏప్రిల్ 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఇంటింటికి సిపిఐ సామూహిక నిధి,విరాళాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక గణేష్ నగర్ కమాన్ చౌరస్తాలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా, శ్రమనే నమ్ముకొని జీవిస్తున్న కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, ప్రపంచ మానవాళికి అన్నం పెట్టే అన్నదాతలకు అండగా నిలవడం కోసం, పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం భారతదేశంలో 1925 డిసెంబర్ 25న సిపిఐ ఆవిర్భవించిందని, నాటినుండి నేటి వరకు వందేళ్లుగా ప్రజా సమస్యలే తమ సమస్యలుగా భావించి పో కేవలం ఒక్క కమ్యూనిస్టు పార్టీయే నని అన్నారు.దేశంలో కమ్యూనిస్టు పార్టీ వల్లనే ప్రజలకు మేలుజరుగుతుందని, రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, భూ సంస్కరణల చట్టం,అనేక కార్మిక చట్టాలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం,సమాచార హక్కు చట్టం ఇలా అనేక ప్రజా ఉపయోగకర చట్టాలు తీసుక రావడం కోసం సిపిఐ అనేక పోరాటాలు చేసిందని, దేశంలో వారివారి స్వలాభం కోసం, అధికారం కోసం పుట్టుకొచ్చిన పార్టీలు ఎన్నో ఉన్నాయి,కొన్ని పార్టీలు కాలగర్భంలో కలిసి పోయాయి కానీ వందేళ్లుగా ప్రజల కోసమే పనిచేస్తున్న, పోరాడుతున్న పార్టీ కేవలం సిపిఐ మాత్రమేనని, ఎన్నో ప్రజోద్యమాలు నిర్వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ ని ఈ దేశంలో కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, కార్యక్రమాల, కార్యాలయాల నిర్వహణ కోసం కమ్యూనిస్టు శ్రేణులకు ఆర్థిక సహాయం అందించి వారికి అండగా నిలవాలని ప్రజలకు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,జిల్లా కార్యవర్గ,కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్ గూడెం లక్ష్మీ, టేకుమల్ల సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బండ రాజిరెడ్డి, చొక్కల్ల శ్రీశైలం, మావురపు రాజు, మచ్చ రమేష్, బావండ్లపెల్లి యుగేందర్, కొట్టె అంజలి, బూడిద సదాశివ, నగర సిపిఐ నాయకులు బాకం ఆంజనేయులు, నగునూరి రమేష్,కసిరెడ్డి సందీప్ రెడ్డి.మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# పండుగల మహనీయుల జయంతి ఉత్సవాలు....

**● కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి రావాలి ● బాబు జగ్జీవన్, అంబేదర్కర్ జయంతోత్సవాల కమిటీ పిలుపు**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రామ్, ఏప్రిల్ 14న డా. బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పండుగల ఘనంగా నిర్వహించుకుందామని పెద్దపల్లి జిల్లా జయంతోత్సవాల కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ కుల, మతాలకు అతీతంగా పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. మహనీయుల జయంతి రోజున మీమీ గ్రామాల్లో జయంతి కార్యక్రమం నిర్వహించుకున్న అనంతరం జిల్లా కేంద్రంను తరలిరావాలన్నారు. కమాన్‌చౌరస్తా నుంచి కోలాటం, డప్పుసప్పుడులతో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పల్లె నుంచి ఆయా రోజుల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములై, ఘన నివాళి అర్పించాలని కోరారు. వివిధ ప్రజాసంఘాల నేతలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్స్, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరై వారిని సర్మించుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు సైతం హాజరు కావాలని జయంతోత్సవ కమిటీ తరుపున ఆహ్వానిస్తున్నామన్నారు. మహనీయుల జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, వారి చరిత్రను తెలుసుకోని, అధ్యయనం చేయాలన్నారు. వారి ఆశయాలను కొనసాగించేలా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డా.బిఆర్ అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ చైర్మెన్ మామిడిపల్లి బాపయ్య, బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవ కమటీ చైర్మెన్ అంబాల రాజేందర్, వైస్ చైర్మెన్‌లు ఆరెల్లి మల్లేష్, బొంకూరి కైలాసం, బొంకూరి సురేందర్ సన్నీ, లింగమల్ల శంకరయ్య,కోంర్డ శంకర్, కుక్క కనకరాజ్, తుల్లా నాగరాజ్, కుక్క అశోక్, బొంకూరి నరేందర్, బొంకూరి నవీన్‌బాబు, కల్లేపల్లి రవి, కొంకటి లింగమూర్తి, కల్వల మల్లేష్, పెర్క శివకుమార్, ఈదునూరి విజయ్, కాసిపాక వాసు, కనుకుంట్ల సదానందం, కుక్క శ్రావణ్ కుమార్, బొంకూరి రమేష్, దొమ్మటి సదయ్య, అంబాల నరేష్, పెర్క సతీష్, కల్లేపల్లి అశోక్, రామిళ్ల శారద, గూల్ల రాజు, సత్యనారాయణ, సలిగంటి రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ని వెంటనే రద్దు చేయాలి



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 1(ది క్రైమ్ న్యూస్):-** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ రోజు నుండి నాలుగు లేబర్ కోళ్లను అమలు చేయాలని తీసుకువచ్చిన సర్క్యులర్ ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా నాలుగు లేబర్ కోర్సు రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిరసిస్తూ, బుదవారం జాతీయ రాష్ట్రీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బయ్యారంలో మెయిన్ రోడ్డు పై మండల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది .అనంతరం ఈ కార్యక్రమం ఉద్దేశించి టి యు సి ఐ రాష్ట్ర నాయకులు బిళ్ళ కంటి సూర్యం ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఎస్కె మదర్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో కార్మికులు సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోట్లుగా మార్చి ఈరోజు వాటి అమలుకు పూనుకోవడం చాలా దుర్మార్గమైనదని వారన్నారు దేశంలో 44 కోట్ల మంది సంఘటిత అసంఘటిత కార్మికులు ఉన్నారని వారికి ఎటువంటి హక్కులు సంక్షేమాలు లేవని అన్నారు. నేడు దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ల తీసుకువచ్చి కార్మికులను కార్పొరేట్ శక్తులకు కట్టు బానిసలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్స్ వలన కార్మికునికి తన హక్కును సాధించుకునే అధికారాన్ని కోల్పోతాడని కనీసం తన సమస్యపై ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకునే స్థితిని కోల్పోతాడని యజమాన్యానికి ఎదురు తిరగకుండా కట్టు బానిసలుగా పని చేసే విధానానికి నిదర్శనమే లేబర్ కోడ్లని అన్నారు. కార్మికులు అనేక సంవత్సరాలుగా కొట్లాడి సాధించుకున్న హక్కులను అలానే ఉంచి నేడు తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడిని వెంటనే ఉపసంహరణకు మోడీ ప్రభుత్వం అంగీకరించాలని లేనియెడల రాబోయే ఎన్నికల్లో కార్మిక వర్గం తన సత్తాను సూచిస్తుందని కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం మోడీ ప్రభుత్వం తీసుకొచ్చే నాలుగు కోళ్లకు వ్యతిరేకంగా ఉద్యమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా కోశాధికారి పూజల లచ్చయ్య భక్తుల ధనంజయ గుర్రం పూర్ణ జల్లి వెంకన్న ఎస్కే జానీ సి ఐ టి యు నాయకులు రాయబారపు అప్పయ్య రాము అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు

**● రంగంపల్లి లోని సఖీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రంగంపల్లి లోని సఖీ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సఖి సెంటర్ లోనే రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారు. సఖి కేంద్రంలో కౌన్సిలింగ్ అందుకుంటున్న వివిధ జంటలను కలెక్టర్ సఖి సెంటర్ ద్వారా అందుతున్న సేవలు వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా రిలీఫ్ రావాలని, ఇటువంటి కేసుల పై అధిక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.సఖీ సెంటర్ కు వచ్చిన మహిళల సమస్య పరిష్కారానికి కృషి చేసి వారిని రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. సఖి సెంటర్ కు వచ్చే బాధితులకు అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని, వివిధ కేసులలో అవసరమైన సందర్భంలో న్యాయ సలహా సైతం అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ సఖీ సెంటర్ ద్వారా అందించే సేవల గురించి ప్రచారం కల్పించి , సఖి సెంటర్ కు వచ్చే బాధితుల సంఖ్య పెంచాలని కలెక్టర్ అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా కమిటీ ఎన్నిక

**- జిల్లా అధ్యక్షులుగా పిట్ట రమేష్, ప్రధాన కార్యదర్శిగా తూండ్ల రాజయ్య**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన జిల్లా కార్యవర్గాన్ని అధ్యక్షులుగా పిట్ట రమేష్, ప్రధాన కార్యదర్శిగా తూండ్ల రాజయ్యల ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు పిట్ట రమేష్, ప్రధాన కార్యదర్శి తూండ్ల రాజయ్యలు మాట్లాడుతూ టీపీసీసీ సాంస్కృతిక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు ఆదేశాల మేరకు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. గౌరవ అధ్యక్షులుగా బుర్రగడ్డ రవి, ఉపాధ్యక్షుడిగా పోలివేణి శ్రీనివాస్, కోశాధికారిగా దాసరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా పూసాల రమణాచారి, ముఖ్య సలహాదారులుగా మంద భాస్కర్ యాదవ్, సహాయక కార్యదర్శి బియ్యన్న తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలుగా కమేర పద్మ , ప్రధాన కార్యదర్శి కోంద్ర సునీత, కార్యవర్గ సభ్యులుగా కన్నూరి రాజయ్య, తాంద్ర మహేష్, భర్ల తిరుపతిలను ఎన్నుకున్నామని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలో జరిగే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు. తమ ఆటపాటలతో, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకపోతామని తెలియజేశారు. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణరావు, టీపీసీసీ సాంస్కృతిక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# లేబర్ కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తూ (సిఐటియు) నిరసనలు



**భూపాలపల్లి, ఏప్రిల్ -1:(ది క్రైమ్ న్యూస్):** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన లేబర్ కోడుల అమలుతో కార్మికులకు, కార్మిక సంఘాలకు ఎటువంటి చట్టపరమైన హక్కులు లేకుండా పోతాయని, దీన్ని అన్ని కార్మిక సంఘాలు కార్మికులు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని అవసరమైతే ఢిల్లీలోని రైతుల స్ఫూర్తితో నిరవధిక సమ్మె చేయడానికి కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని సిఐటియు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేసిన ఇప్పటివరకు లేబర్ కోడ్ లను అమలు చేయమని చెప్పడానికి వెనుకడుగు వేస్తున్నారని, అన్నారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడులను ఈరోజు నుండి అమలు చేస్తుంటే కొన్ని కార్మిక సంఘాలు దానిపై మాట్లాడడానికి సైతం వెనుకడుగు వేస్తున్న విధానాలు సరైనది కావన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసరించుకునేలా కార్మిక వర్గం ప్రతిఘటనకు పును కోవాలన్నారు. లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు ఐక్యంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని కార్మికుల్ని నిరాయుధలను చేసి పెట్టుబడుదారులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేటర్లకు బంగారు పళ్లెంలో పెట్టి బహుమానం ఇచ్చేందుకు సిద్ధమైందని అన్నారు. అందులో భాగంగానే విరోచితంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చింది అన్నారు. కార్మికులకు రైతులకు ప్రజలకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ ల ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడప శేఖర్, ప్రభాకర్, రాజశేఖర్, శంకర్, జ్ఞానేశ్వరి, రాజేష్, రమ, సమ్మక్క, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హాలియా పట్టణంలో రోడ్ల ఆక్రమణలపై కఠిన చర్యలు





**నల్గొండ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై అక్రమంగా స్థిరంగా ఆక్రమణలు చేస్తున్న తోపుడుబండ్లు మరియు షాపుల యజమానులపై మున్సిపల్ అధికారులు పోలీసుల సహకారంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా రోడ్లపై వ్యాపారం చేయడం, ఫుట్‌పాత్‌లపై వస్తువులు ఉంచడం వంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని కమిషనర్ హెచ్చరించారు. తోపుడుబండ్లపై వ్యాపారం చేసే వారు తమ వ్యాపారం పూర్తయ్యిన వెంటనే బండ్లను అక్కడి నుండి తొలగించి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. లేనిపక్షంలో బండ్లను సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలు కొనసాగితే మున్సిపాలిటీ చట్టాల ప్రకారం ప్రత్యేక బృందాలతో తొలగింపు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు, ప్రమాదాలను తగ్గించేందుకు మరియు పట్టణ శుభ్రత కోసం వ్యాపారులు తమ షాప్ పరిధిలోనే వ్యాపారం నిర్వహించాలని అధికారులు కోరారు. ప్రజల సౌకర్యార్థం అందరూ మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# మహిపాల్ రెడ్డికి కాటా శ్రీనివాస్ గౌడ్ సవాల్

## ● భీరాంగూడ శివాలయంలో ప్రమాణానికి సిద్ధం





**పటాన్చెరు, ఏప్రిల్ 01(ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ బుధవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన కుటుంబం చరిత్ర ఉన్న కుటుంబమని, పేదలకు అండగా నిలిచిందని తెలిపారు. మా కుటుంబం పేరుతో కాలనీలు ఉన్నాయి. ఇలాంటి కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని అన్నారు. కేసీఆర్‌తో తమ కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భూకబ్జాలకు పాల్పడుతున్నారని కాటా శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పటాన్‌చెరు పరిధిలోని 62, 64, 65, 178, 453 సర్వే నంబర్లలో అక్రమంగా ప్లాట్లు వేసి విక్రయాలకు సిద్ధమవుతున్నారని అన్నారు. వందల కోట్ల రూపాయల అక్రమ సంపాదన చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నావనే భావంతో అక్రమంగా భూములు ఆక్రమించి అమ్ముకుంటున్నారు. ఈ విషయాలపై ఆధారాలు ఉన్నాయి. అవసరమైతే ఈడీ అటాచ్ చేసిన పత్రాలను బహిర్గతం చేస్తానని స్పష్టం చేశారు. ఇక ఆరోపణలు నిజమైతే నిరూపించేందుకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. “బీరంగూడ శివాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు పసుపు బట్టలతో ప్రమాణం చేద్దాం. కార్యకర్తలు లేకుండా దేవుడి సాక్షిగా నిజం తేల్చుకుందాం అని పిలుపునిచ్చారు. “చైర్మన్ పదవికి డబ్బులు తీసుకున్నానని చెబితే నిరూపించాలి. నువ్వు చేసిన ఆరోపణలు నిజమని నమ్మితే మాట మీద నిలబడాలని అన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యే అవినీతి వ్యవహారాలను బయటపెడతానని కాటా శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. “రాష్ట్రంలో ఎవరిని అడిగినా నీ అవినీతి బాగోతం బయటపడుతుంది” అంటూ తీవ్ర విమర్శలు చేశారు. అలాగే, రాజకీయ లాభాల కోసం పార్టీలు మారే చరిత్ర మహిపాల్ రెడ్డిదేనని ఆరోపించారు. గత ఎన్నికల్లో కూడా వెన్నుపోటుతోనే గెలిచారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో పటాన్‌చెరు రాజకీయాల్లో మరింత ఉద్రిక్తత నెలకొంది.

# ప్రజల సమస్యల పరిష్కారానికి వార్డు సభలు: హాలియాలో అవగాహన సమావేశం






**నల్గొండ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక– 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా, 02.04.2026 న నిర్వహించబడనున్న వార్డు సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి హాలియా మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ చైర్పర్సన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. వార్డు సభలో చర్చించవలసిన ముఖ్య అంశాలపై అధికారులు వివరించారు. ముఖ్యమంత్రి సందేశం, ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలు, ఇప్పటివరకు సాధించిన విజయాలు, అలాగే లబ్ధిదారుల అభిప్రాయాలను స్వీకరించడం వంటి అంశాలు ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వార్డు స్థాయిలో అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం, ప్రజల సమస్యలను నమోదు చేయడం ఈ సభల ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్య పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదనంగా, ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అల్పాహార పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకం, దివ్యాంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటార్ వాహనాలు, పంటల వైవిధ్యకరణ ప్రకృతి సేంద్రియ వ్యవసాయం వంటి కొత్త పథకాల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి , 2వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ, 4వ వార్డు కౌన్సిలర్ కడమంచి ప్రమీల, 5వ వార్డు కౌన్సిలర్ చిట్టిపోలు శ్రీదేవి, 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 11వ వార్డు కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్ బాబు, 12వ వార్డు కౌన్సిలర్ ఎడవల్లి మేరీ పాల్గొన్నారు.

# ఆకాశం కురిసింది... ప్రభుత్వం మరిచింది

**● అకాల వర్షంతో అన్నదాత బతుకు ఆగం ● పంటలు మట్టిలో.. హామీలు గాలిలో ● నిరుటి పంట నష్టం జాడలేదు ● ప్రస్తుతానికి దిక్కులేదు ● అదే సీన్ రిపీట్ అవుతుందా?**
**● ప్రకృతి వైపరీత్యాలకు పంటను కోల్పోయిన అన్నదాత బతుకులపై ది క్రైమ్ న్యూస్ స్పెషల్ స్టోరీ...**



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో రైతన్నల పరిస్థితి చూస్తే గుండె పగిలిపోతోంది.అకాల వర్షం మరోసారి జిల్లా రైతులను నిండా ముంచింది. చెమటోడ్చి పెంచుకున్న మొక్కజొన్న, వరి, మామిడి తోటలు కళ్ళముందే నేలమట్టమయ్యాయి. మరికొద్ది రోజుల్లో చేతికొచ్చే పంట ఒక్క రాత్రి కురిసిన గాలి వానకు నేలమట్టం. వానాకాలం నాటుకున్న పత్తి గిట్టుబాటు గాక యాసంగిలో మొక్కజొన్నపై పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. ఆరుగాలం చెమటోడ్చిన రైతు – చివరికి కన్నీళ్లు కూడా ఆరిపోయే స్థితి. దుక్కి దున్నిన దగ్గర నుండి నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, నకిలీ పురుగు మందులతో పోరాడిన రైతన్న చివరి మెట్టుకు చేరుతుండగా ప్రకృతి కొట్టిన ఒకే ఒక్క దెబ్బతో గేమ్ ఓవర్ అన్నట్టయింది.

ఇది ఒక్కసారే కాదు గత యాసంగి సీజన్లో కూడా ఇదే కథ. నెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు కురిసిన అకాల వర్షానికి వేల ఎకరాల పంట నేలమట్టం అయింది. నష్టం జరిగినట్టు స్వయంగా అధికారుల రిపోర్టులు.. సిద్ధమైన నివేదికలు.. నాయకుల సిఫార్సులు... సీఎం టేబుల్ మీద ఫైల్లు.. కానీ రైతు ఖాతాలో ఇప్పటివరకు పడింది మాత్రం గుండు సున్నా.

విపరీతమైన పంట నష్టం జరిగినప్పుడు వచ్చారు... ఫోటోలు దిగారు.. గొప్ప గొప్ప మాటలు ఎన్నో చెప్పారు.. మేమున్నామంటూ భుజాల మీద చేయి వేసి వెళ్ళిపోయారు.. ఇక అంతే తిరిగి మళ్ళీ కనిపించలేదు. పంట నష్టం ఊసే లేదు. ఇప్పుడు కూడా అదే సీన్ రిపీట్ అవుతుందా? అంటూ రైతన్నలు అమాయకంగా ప్రశ్నిస్తున్నారు.

పోయిన పంటకు పైసలు రాలేదు.. ఇప్పుడు పోయిన పంట కైనా న్యాయం చేస్తారా? లేక మళ్లీ అదే పాత స్క్రిప్టులు – సర్వేలు..ఫోటోలకు ఫోజులు.. అడ్డగోలు హామీలు.. జీరో బ్యాలెన్స్ లు. ఇప్పుడు రైతన్న ఒకటే అడుగుతున్నాడు. మా కష్టానికి విలువ లేదా? మేము ఓటేసే యంత్రాలమేనా.

సభల్లో సమావేశాల్లో మైక్ పట్టుకుని రైతుల బతుకులు మారుస్తున్నామంటూ గొంతు చించుకున్న నాయకులు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రం సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోతున్నారు. అవకాశాన్ని పబ్లిసిటీ స్టంట్ లాగే వాడుకుంటున్నారని రైతులు మండిపడుతున్నారు.

ప్రకృతి కొట్టే దెబ్బలను భరిస్తూ వస్తున్న రైతన్నకు ప్రభుత్వం కొట్టే నిర్లక్ష్యపు దెబ్బ మూలిగే నక్క మీద తాటికాయ సామెతను గుర్తు చేస్తున్నది.

# మానవతా దృక్పథంతో ముందుకొచ్చిన కుటుంబం

**● ఇద్దరికీ చూపు ప్రసాదించిన బ్యాంకు మాజీ ఉద్యోగి ● బాధలో మరో ఇద్దరికి వెలుగు పంచిన జంగంపల్లి కుటుంబ సభ్యులు**



**రామగిరి, ఏప్రిల్ 01(ది క్రైమ్ న్యూస్):-** కమాన్ పూర్ మండల కేంద్రం చెందిన జంగేపల్లి మల్లయ్య మాజీ బ్యాంకు ఉద్యోగి మరణాంతరం కుటుంబ సభ్యులు ఆయన కళ్ళను కమాన్ పూర్ లైన్స్ క్లబ్ వారికి అందజేశారు.కమన్ పూర్ లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ పెద్దపల్లి జిల్లా కమన్ పూర్ మండల కేంద్రంలో నివసించే జంగపల్లి మల్లయ్య (75)మాజీ బ్యాంకు ఉద్యోగి బుధవారం అనారోగ్యం తో మృతిచెందారు. ఇంటి పెద్ద మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇలాంటి దుఃఖ సమయంలో కూడా మానవతా దృక్పథంతో ముందుకొచ్చిన కుటుంబం. నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని, మల్లయ్య కళ్ళు సజీవంగా ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయని కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కోశాధికారి డా విజయకుమార్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతోభార్య జంగాపల్లి లక్ష్మి కుమారులు సత్య నారాయణ,విజయ్ కుమార్ కుమార్తెలు వెంకట్ లక్ష్మి– అల్లుడు పోతరాజు సమ్మయ్య మనవళ్లు మనవరాలు రవళి,యశ్వంత్ సాయి, రిషిత, ప్రియతమ్ అంగీకరించారు. బుధవారం సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి,కమన్పూర్ మండల అధ్యక్షులు నర్సింహా చారీ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణరెడ్డి కార్యదర్శి నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుని నేత్రాలను సేకరించారు. అనంతరం వాటిని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ సందర్భంగా నేత్రదాత కుటుంబ సభ్యులను కమన్పూర్ లయన్స్ క్లబ్ సభ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు సతీష్, శ్రీను అభినందించారు. పార్థివదేహం వద్ద మౌనం పాటించి నేత్రదాతకు నివాళులర్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, క నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, వెల్ది కవిత అనంతరాములు, కుటుంబ సభ్యుల సేవాభావాన్ని కొనియాడారు. నేత్రదానం కార్యక్రమంలో పలు పెద్దపల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టులో పెను ప్రమాదం..

## చలువ పందిరి కూలి పలువురికి గాయాలు...



**జగిత్యాల, ప్రతినిధి ఏప్రిల్ 01 (ది క్రైమ్ న్యూస్):** బుధవారం మల్యాల మండలం కొండగట్టు అంజన్న ప్రముఖ పుణ్యక్షేత్రంలో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల వేళ మొదటి రోజే పెను ప్రమాదం సంభవించింది. భక్తుల సౌకర్యార్థం కోనేరు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక తలనీలాల చలువ పందిరి ఒక్కసారిగా కూలిపోయింది.” ఈ ఘటనలో అక్కడ విధుల్లో ఉన్న పలువురు నాయి బ్రాహ్మణులు. భక్తులు పందిరి కింద చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలవ్వగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా వెంటనే స్పందించిన ఆలయ అధికారులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. పనుల నాణ్యత లోపమే ఈ ప్రమాదానికి కారణమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.”

# నేడు ప్రతీ గ్రామంలో గ్రామసభను నిర్వహించాలి





**మానకొండూర్, ఎప్రిల్1(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల ప్రత్యేకాధికారి టి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు.నేడు ఉదయం 10.00 గం లకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల ఖర్చు, ప్రభుత్వ పథకాల అమలును ప్రజలకు వివరించాలన్నారు. దీనికి సంబంధించిన కరదీపికలను సభకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ అందించాలని, గ్రామసభల్లో ప్రజలకు ఇబ్బందీ లేకుండా నీడ, తాగునీటి సౌకర్యం కలిపించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సూచించారు. ఎంపీడీవో వి.వరలక్ష్మి, ఎంపీఓ సత్తీష్ రావు, గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.

# పేదల కోసమే ప్రభుత్వ పథకాలు: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, ఎప్రిల్1(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన కల్యాణ లక్ష్మి లబ్దిదారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూకళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలుస్తుండగా పథకాలతో లక్షా నూటపదహారు రూపాయలు అందించామని, అర్హులైన పేద ఆడబిడ్డల పెళ్ళిళ్ళకు ఆర్థిక సహాయం అందాలనే ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు.స్థానిక తాహసిల్దార్ కర్ర శ్రీనివాసరెడ్డి, ఆర్ఐలు రవీందర్, లక్ష్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఎం జ్యోతి, ఆర్.రమేష్ జీపీఓ రేవంత్, పార్టీ మండలాధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, గొట్టిముక్కల సంపత్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి తదితరులు చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు.

# హాలియా ఎన్ ఎస్ పి కాల్వకట్ట పరిశుభ్రత పనులు

## - చైర్మన్ పర్యవేక్షణలో శుభ్రపరిచిన పరిసరాలు



**నల్గొండ (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి గారు ప్రత్యక్ష పర్యవేక్షణలో శానిటేషన్ సిబ్బందితో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. హాలియాలోని ఎన్ ఎస్ పి కాల్వకట్టపై పేరుకుపోయిన రాళ్లు, మట్టి కుప్పలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ చర్యల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

# గిరిజన విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**● మినీ గురుకులం ను 10వ తరగతి వరకు నడిపేలా అప్ గ్రేడ్ ● ధర్మారం గిరిజన మినీ గురుకులంలో నిర్మించనున్న అదనపు తరగతుల పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గిరిజన విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మారం గిరిజన మినీ గురుకులంలో నిర్మించనున్న అదనపు తరగతుల పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉన్న సమయంలో మినీ గురుకులం పర్యటించినప్పుడు పిల్లలు పడుతున్న బాధలను గమనించి జిల్లా కలెక్టర్ సహకారంతో డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి చేశామని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలకు బాగా చదువుకోవాలని లక్ష్యంతో అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. ధర్మారం గిరిజన శాఖ మినీ గురుకులం విద్యార్థుల సంఖ్య పెంచాలని, ఈ గురుకులం ప్రస్తుతం ఐదవ తరగతి వరకు ఉందని, దీనిని అప్ గ్రేడ్ చేస్తూ 10వ తరగతి వరకు నడిపేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తే వెంటనే ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు జారీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలని లక్ష్యంతో 200 కోట్లతో ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నారని మంత్రి తెలిపారు. ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన గురుకులాలు ఒకేచోట అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని, ఈ పనులు వారం రోజులలో ప్రారంభమవుతాయని అన్నారు. ధర్మారం మండలంలో ఐటీఐ మంజూరు చేసామని ఈ పనులు త్వరలో ప్రారంభమవుతాయని అన్నారు. గతంలో వైయస్సార్ హయాంలో ధర్మారంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో తాను కీలకపాత్ర పోషించానని, ప్రస్తుతం ఎక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. సంక్షేమ శాఖ పరిధిలో వివిధ వర్గాలకు చెందిన గురుకులాలు రెహించల్ పాఠశాలలో అవుట్సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ కు జీతాలు, డైట్ చార్జీలు కాస్మెటిక్ చార్జీలుగత ప్రభుత్వం



నెలల తరబడి జీతాలు చెల్లించక పెండింగ్లో పెట్టేదని, ప్రస్తుతం డిప్యూటీ సీఎం సహకారంతో ప్రతినెలా 7 తేదీ లోపు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఏప్రిల్, మే నెలలో గురుకులాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అక్కడ అవసరమైన మరమత్తు పనులు పూర్తి చేసి విద్యార్థులకు రాబోయే విద్యా సంవత్సరం నాటికి మరింత మెరుగ్గా గురుకులాలను సిద్ధం చేయాలని అన్నారు. **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష :** గత రెండు సంవత్సరాల కాలంలో ధర్మారం గిరిజన మినీ గురుకులం రూపు రేఖలు మారిపోయాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంత్రివర్యులు





ఆదేశాల మేరకు డైనింగ్ హాల్ నిర్మాణం, పిల్లల కోసం డార్మటరీ లో పడకలు గతంలో ఏర్పాటు చేశామని అన్నారు. నేడు పీఎం జుగా ( ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్) యోజన కింద కోటీ 10 లక్షల రూపాయలు ఖర్చు చేసి హాస్టల్ భవనం, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను చేపట్టామని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న అన్ని మినీ గురుకులాల్లో ప్రభుత్వం పిల్లలు సరదాగా గడిపేందుకు ఆట వస్తువులు, పిల్లలకు సైకిల్స్ పంపిణీ చేస్తుందని అన్నారు. మినీ గురుకులంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వల్ల ఇక్కడ పనిచేసే స్టాఫ్, ఉపాధ్యాయులపై మరింత బాధ్యత రావాలని, ఇక్కడ చదివే పిల్లలందరికీ నాణ్యమైన అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మిగిలిన జిల్లాలతో పోలిస్తే పనులు పెద్దపల్లి జిల్లాలోనే ముందుగా ప్రారంభమవుతున్నాయని, వీటిని నాణ్యతతో త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకుని రావాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ధర్మారం లోని ప్రభుత్వ స్థలాలను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్ శ్రీనివాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# సమిష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

**● ఆర్.జి-త్రీ జి.యం సుంకర మధుసూదన్**

**రామగిరి, ఏప్రిల్ 01(ది క్రైమ్ న్యూస్):-** సమిష్టి కృషితోనే ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-త్రీ ఏరియా ఓ.సి.పి-టు ఉపరితల గని నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించినందుకు గాను బుధవారం ఓ.సి.పి-టు ఉపరితల గని లో ఏర్పాటు చేసిన అభినందన సభకు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం ఓ.సి.పి-టు ఉపరితల గనికి నిర్దేశించిన 30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 29.35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సమిష్టి కృషితో సాధించినందుకు సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. అలాగే 29.34 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి రికార్డు సాధించినందుకు అభినందించారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో, భద్రతతో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని, యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని, యంత్రాలకు చిన్న, చిన్న మరమ్మతులు ఉన్న వాటిని త్వరగా పూర్తిచేసి అందుబాటులో ఉండేవిధంగా చూడాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు. అనంతరం మూడు షిఫ్ట్ లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రము,





బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ఇంచార్జ్ ఎస్వోటుజిఎం బి.వి.సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్ర శేఖర్, ఇంచార్జ్ మేనేజర్ సంపత్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వి.సునీల్ ప్రసాద్, పిట్ సెక్రటరీలు సురేష్, మనోహర్, ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతి




**సుల్తానాబాద్, ఏప్రిల్01 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి 20 గుంటల భూమి కేటాయించాలని కోరుతూ, 800 పైగా కుటుంబాల తరపున సంఘ ప్రతినిధులు తెలంగాణ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కి వినతిపత్రం అందజేశారు. 13 ఏళ్లుగా భవన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, కీ.శే. బిరుదు రాజమల్లు చొరవతో ఏర్పడిన సంఘానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కందుకూరి ముత్యాలు, ప్రధానకార్యదర్శి అమరశెట్టి రాజలింగం, వార్డు 2 కౌన్సిలర్, కార్యవర్గ సభ్యులు గాజుల రాజమల్లయ్య, సంఘ నాయకులు బిరుదు రాధాకృష్ణ, కామ సంపత్, శ్రీగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

**తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన శ్రేణులు**





**ధర్మపురి, ఎప్రిల్ 1, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. బుధవారం ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ధర్మపురి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మంత్రి కి శుభాకాంక్షలు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తోపాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు అధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ప్రజల ప్రేమానురాగాలు ఇలాగే కొనసాగాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

# గర్రెపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం



**సుల్తానాబాద్, ఏప్రిల్01(దిక్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి కేటాయించినా 15 పదిహేను లక్షల రూపాయలతో శకుంతల ఇంటి నుండి మల్లేశం ఇంటి వరకు బుధవారం సిసి రోడ్డు నిర్మాణం పనులు సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింత కుంట విజయ్ రమణ రావు చొరవతో చేపట్టిన ఈ పనులతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవీన్, వార్డ్ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగినది.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి జన్మ దిన వేడుకలు



**సుల్తానాబాద్, (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి పద్మ మహేందర్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హోమం, స్వామివారికి విశేష అభిషేకం, పడిపూజలు కన్నుల పండువగా నిర్వహించారు. గురుస్వామి మిట్టపల్లి మురళీధర్, అర్చకులు గూడ రమేష్ శర్మ, సాయినాథ్ శర్మ లు స్వామివారి అభిషేకం పడిపూజ వేడుకలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ సమత, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ మారవేణి లచ్చయ్య, డీలర్ వెంకన్న, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ చంద్రకుమార్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే నీరుకుల్లా రోడ్ లోని శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అభిషేకం హోమాలు ఘనంగా నిర్వహించారు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు, ఆలయ అర్చకులు సద్దనపు రవీంద్ర చారి, ఆలయ నిర్వాహకులు బుచ్చిరెడ్డి , శంకరయ్య పలువురు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను సకాలంలో చెల్లిస్తే 5శాతం రాయితీ





**జమ్మికుంట ఏప్రిల్ 1 (ది క్రైమ్ న్యూస్):** ఆస్తి పన్ను చెల్లింపుదారులను సకాలంలో చెల్లింపులు చేయడానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు ఆస్తి పన్నులు 5 శాతం రాయితీ కల్పించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రస్తుత సంవత్సరపు ఆస్తి పన్నుపై 01 ఏప్రిల్ 2026 నుండి ఈ నెల చివరి వరకు అమలులోకి వచ్చేలా 5% రాయితీని అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## అవినీతికి పాల్పడితే సహించేది లేదు..

**- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, చైర్మన్ ప్రశాంత్ కుమార్**





**జమ్మికుంట ఏప్రిల్ 1 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో అర్పిలు అవినీతికి పాల్పడితే సహించేది లేదని మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అర్పిలతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోర్ డోర్ చెత్త సేకరణ, మున్సిపల్ అభివృద్ధిలో అర్పిల పాత్ర చాలా కీలకమైనదన్నారు. అర్పిలు సంఘాలకు బ్యాంక్ నుండి లోన్ ఇప్పించడం బాధ్యత అని వారు అన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సంఘ సభ్యులు లోన్ ఇచ్చే ముందు డబ్బులు అడుగుతున్నారని మా దృష్టికి కానీ, ఏసీబీ అధికారులకు గానీ సమాచారం నేరుగా ఇవ్వవచ్చు అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, మెప్మా ఇంచార్జి టి.ఎం.సి మల్లీశ్వరి, సి.ఎల్.అర్పిలు, అర్పిలు, సమాఖ్య ఓబీలు పలువురు పాల్గొన్నారు.

# కెప్టెన్ అయ్యర్‌కు భారీ జరిమానా!?

స్పోర్ట్స్



2026 ఐపీఎల్? టోర్నమెంట్?ను విజయంతో ఘనంగా ఆరంభించిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్? శ్రేయస్ అయ్యర్?కు గట్టి షాక్ తగిలింది. ముల్లాన్?పూర్ వేదికగా గుజరాత్?తో జరిగిన మ్యాచ్?లో పంజాబ్ 3 వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే ఈ మ్యాచ్?లో స్లో ఓవర్ రేట్ కారణంగా అయ్యర్?కు ఐపీఎల్? గవర్నింగ్ కౌన్సిల్ భారీ జరిమానా విధించింది. కాగా, ఈ సీజన్ ప్రారంభమైన నాలుగో మ్యాచ్?లోనే స్లో ఓవర్ రేట్ నమోదవ్వడం విశేషం."ముల్లాన్?పూర్ న్యూ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్?లో పంజాబ్ కింగ్స్ జట్టు స్లో ఓవర్ రేట్ కొనసాగించింది. అయితే దీన్ని తొలి తప్పిదంగా భావిస్తూ, ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ 2.2ను ఉల్లంఘించినందుకు పంజాబ్ కెప్టెన్? అయ్యర్?కు రూ.12 లక్షల జరిమానా పడింది" అని ఐపీఎల్ కమిటీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా, టాస్ నెగ్గిన పంజాబ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే నిర్ణీత సమయంలోపు 20 ఓవర్లను పూర్తి చేయడంలో పంజాబ్ విఫలమైంది. దీంతో స్లో ఓవర్ రేట్ కారణంగా అయ్యర్?కు ఫైన్ పడింది. ఈ సీజన్?లో ఓ జట్టు స్లో ఓవర్ రేట్ నమోదు చేయడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో కొత్త సీజన్?లో జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్?గా అయ్యర్ చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. ఇక ఇది తొలి తప్పిదం కావడంతో రూ.12 లక్షల ఫైన్ పడింది. ఒకవేళ ప్రస్తుత సీజన్?లోనే ఇది మళ్లీ రిపీటైతే కెప్టెన్?కు రూ.24 లక్షల జరిమానా విధిస్తారు. అలాగే జట్టులోని ప్లేయర్ల ఫీజులో కూడా కోత పెడతారు. ఇక మూడోసారి కూడా ఇది రిపీటైతే కెప్టెన్?కు 50శాతం ఫైన్?తోపాటు ఒక మ్యాచ్ నిషేధం విధిస్తారు.ఛేదనలో పంజాబ్ ఇన్నింగ్స్ 12వ ఓవర్లో కెప్టెన్ అయ్యర్ గాయపడ్డాడు. ఈ ఓవర్‌ను రషీద్ ఖాన్ బౌలింగ్ చేశాడు. అతడు వేసిన బంతిని స్ట్రైకింగ్?లో ఉన్న కూపర్ కొనోలీ బలంగా బాదాడు. అయితే అది నేరుగా వెళ్లి నాన్‌స్ట్రైకింగ్ ఎండ్?లో ఉన్న శ్రేయస్ అయ్యర్ చేతికి బలంగా తాకింది. దీంతో నొప్పితో అయ్యర్ విలవిల్లాడాడు. వెంటనే ఫిజియోలు గ్రౌండ్?లోకి వచ్చి అయ్యర్ పరిస్థితిని పరిశీలించారు. ఇక అలాగే నొప్పితోనే అయ్యర్ బ్యాటింగ్ కొనసాగించాడు. అయితే తన గాయంపై మ్యాచ్ అనంతరం అయ్యర్? అప్డేట్ ఇచ్చాడు. 'మొదటి మ్యాచ్‌లో నెగ్గడం బాగుంది. అయితే బంతి బలంగా తాకడం వల్ల నొప్పి పుట్టింది. ప్రస్తుతానికైతే బాగుంది. నేను ఎల్లప్పుడూ పాజిటివ్?గానే ఆలోచిస్తా. అంతా మన మంచికే జరిగిందని అనుకుంటాను. ఇక కొనోలీ ఆటను ప్రత్యక్షంగా చూడటం బాగుంది. మంచి షాట్లు కొట్టాడు. స్వల్ప వ్యవధిలో వికెట్లు పడ్డా కనోలీ చివరి దాకా క్రీజులో నిలబడి జట్టును గెలిపించడం అభినందనీయం. త్వరత్వరగా వికెట్లు కోల్పోవడంతో కాస్త టెన్షన్ పడ్డాం. కానీ, ఐపీఎల్‌లో ఇలాంటి పరిస్థితులు కొత్త కాదు. అన్నింటినీ అధిగమించి కొనోలీ ఇన్నింగ్స్‌ను అద్భుతంగా ముందుకు నడిపించాడు' అని అయ్యర్ అన్నాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 162-6 స్కోర్ చేసింది. శు భ్?మన్ గిల్ (39), బట్లర్ (38) ఫర్వాలేదనిపించారు. అనంతరం ఈ టార్గెట్?ను పంజాబ్ 7 వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్లలోనే ఛేదించింది. కూపర్ కొనోలీ (72లి పరుగులు, 5 ఫోర్లు, 5 సిక్స్?లు) అద్భుతమైన హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. అయ్యర్ (18 పరుగులు) విఫలమయ్యాడు.

## గ్లెన్ మాక్స్‌వెల్‌కు నిరాశే

క్రికెట్ ఆస్ట్రేలియా 2026-27 సంవత్సరానికి సంబంధించి సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో స్టార్ ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్‌తో పాటు మాట్ రెన్‌షా, ఫాస్ట్ బౌలర్ జై రిచర్డ్సన్, యువ బ్యాటర్ సామ్ కాన్స్టాస్, ఫాస్ట్ బౌలర్ లాన్స్ మోరిస్, ఆల్‌రౌండర్ మాథ్యూ షార్ట్‌లను కాంట్రాక్ట్ లిస్ట్ నుంచి తప్పించింది. క్రికెట్ ఆస్ట్రేలియా మొత్తం 21 మంది ఆటగాళ్లకు ఈ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో అవకాశం ఇచ్చింది. యాషెస్ సిరీస్‌లో అద్భుతంగా రాణించిన మైఖేల్ నెసర్ ఆస్ట్రేలియా కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు సంపాదించుకున్నారు. నెసర్‌తో పాటు బ్రెండన్ డాగెట్, ఆఫ్ స్పిన్నర్ టాడ్ మర్ఫీలకు కూడా అవకాశం ఇచ్చారు. యాషెస్ సిరీస్‌లో ట్రావిస్ హెడ్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన జాక్ వెదరాల్డ్ కొన్ని మంచి ఇన్నింగ్స్‌లు ఆడాడు. అతనికి సెంట్రల్ కాంట్రాక్ట్ లభించడంతో, ఓపెనర్‌గా అతనికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలని ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డ్ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వెదరాల్డ్ డొమెస్టిక్ క్రికెట్‌లో టాస్మానియా తరపున ఆడుతూ కూడా అద్భుతమైన ఫామ్‌తో పరుగులు సాధించాడు. జై రిచర్డ్సన్‌ను తప్పించడం ఆసక్తికరంగా మారింది. భుజానికి శస్త్రచికిత్స తర్వాత సుదీర్ఘ క్యాంప్ ముగించుకుని టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చి మెల్‌బోర్న్‌లో ఇంగ్లాండ్‌తో ఆడాడు. రిచర్డ్సన్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా జట్టు సహచరుడు మోరిస్ కాంట్రాక్ట్ ముగిసింది. అతను గత ఆగస్టు నుండి వెన్నునొప్పి, సర్జరీ కారణంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. గత ఏడాది మధ్యలో వెస్టిండీస్ పర్యటన తర్వాత టెస్ట్ జట్టు నుండి తప్పుకున్న కాన్స్టాస్ కాంట్రాక్టును పొడిగించలేదు. మాట్ రెన్‌షాకు కూడా ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు దక్కలేదు. షెడ్యూల్, జట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను సిద్ధం చేసినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రధాన సెలెక్టర్ జార్జ్ బెయిలీ తెలిపారు. వచ్చే 12 నెలల్లో దక్షిణాఫ్రికా, భారత్, ఇంగ్లాండ్‌లతో సిరీస్‌లు ఆడాల్సి ఉందని, అలాగే స్వదేశీ సిరీస్‌లు కూడా ఉన్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లే కాకుండా ఇతర ఆటగాళ్ల అవసరం కూడా తమకు ఉంటుందని, వారిని కూడా వినియోగించుకుంటామని బెయిలీ స్పష్టం చేశారు. క్రికెట్ ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్టులో ఉన్న ఆటగాళ్లు స్కాట్ బోలాండ్, అలెక్స్ క్యారీ, పాట్ కమిన్స్, జేవియర్ బార్ట్లెట్, బ్రెండన్ డాగెట్, నాథన్ ఎల్లిస్, కామరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లబుషేన్, నాథన్ లియోన్, మిచెల్ మార్ష్, మాథ్యూ కుహ్నెమాన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, టాడ్ మర్ఫీ, మైఖేల్ నెసర్,జాక్ వెదరాల్డ్, బ్యూ వెబ్‌స్టర్, ఆడమ్ జంపా.



## నా ఫోకస్ అంతా ఆటపైనే

భారత దిగ్గజం సచిన్ తెందుల్కర్ వారసుడిగా క్రికెట్‌లో అడుగుపెట్టిన ఆయన కుమారుడు అర్జున్ తెందుల్కర్ కెరీర్‌లో అంచనాలను అందుకోలేకపోతున్నాడు. మూడేళ్ల కిందటే ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చినా అతడి నుంచి ఇప్పటిదాకా చెప్పుకోదగ్గ ప్రదర్శన రాలేదు. ఈ క్రమంలో గతేడాది అర్జున్‌ను ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసింది. దీంతో కొత్త సీజన్‌లో లఖ్‌నవూతో తన జర్నీ ప్రారంభించనున్నాడు. ఈ నేపథ్యంలో అర్జున్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. అందులో తన కెరీర్ లక్ష్యాల గురించి వెల్లడించాడు. ఇప్పుడు తన ఫోకస్ అంతా ఆటపైనే ఉందని, మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనేదే ప్రస్తుత లక్ష్యమని అర్జున్ అన్నాడు. అలాగే రాబోయే ఐదేళ్లలో తాను 'భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం లేదా ఐపీఎల్ స్టార్‌గా ఎదగడం, ఆటకే ప్రాధాన్యమిస్తూ సింపుల్‌గా సాధారణ వ్యక్తిగా ఉండడమా' అనే మూడింట్లో ఏది ఎంచుకుంటావనే ప్రశ్న అర్జున్‌కు ఎదురైంది. దీంతో అతడు భారత్‌కు ఆడాడాన్నే ఎంచుకుంటాడని అంతా అనుకున్నారు. కానీ, అర్జున్ సమాధానం అందర్నీ ఆశ్చర్యపర్చింది. ఈ ప్రశ్నకు అర్జున్ సింపుల్‌గా జవాబిచ్చాడు. అతడు భారత్‌కు ఆడడమో, ఐపీఎల్‌లో స్టార్‌గా ఉండడాన్నే కోరుకోలేదు. ఇతరులను బాధపెట్టకుండా తనంతట తానుగా హ్యాపీగా ఉండాలని కోరుకుంటానని అన్నాడు. 'ఇతరులను బాధపెట్టకుండా, ఎవరికీ హాని కలిగించకుండా నా అంతట నేను సంతోషంగా ఉంటూ నిజాయితీగా జీవితాన్ని గడపాలనుకుంటున్నా' అని రిప్లై ఇచ్చాడు. దీంతో నెటిజన్లు అతడిని ప్రశంసిస్తున్నారు. ఇలా క్రమశిక్షణ ఉంటూ, కాస్త కష్టపడితే ఎప్పటికైనా టీమ్ ఇండియాలోకి రావొచ్చంటూ కామెంట్ చేస్తున్నారు. అలాగే సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోనని అర్జున్ అన్నాడు. విమర్శలను పట్టించుకోకుండా ఆటపైనే ఫుల్ ఫోకస్ పెడుతూ, తనను తాను మెరుగుపర్చుకునేందుకే కష్టపడుతున్నట్లు చెప్పాడు. అలాగే ఎవరికో నిరూపించుకునేందుకు కాకుండా, ఆటను ఆస్వాధించడంపైనే తన దృష్టి ఉంటుందని అన్నాడు.అంతేకాకుండా 'ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఆడుతున్నప్పుడు ఇంకా ఎక్కువ అవకాశాలు వస్తే బాగుండేదని ఎప్పుడైనా అనిపించిందా' అనే ప్రశ్నకు ఇలా బదులిచ్చాడు. 'ఎందుకు అనిపించదు! ఎవరైనా బెంచ్‌పై కూర్చునేందుకు ఇష్టపడరు కదా మేం నిరంతరం నెట్స్‌లో తీవ్రంగా కష్టపడుతాం. అవకాశం వచ్చినప్పుడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటాం' అని అన్నాడు. అలాగే ఐపీఎల్‌లో ఇటీవల కాంట్రవర్సీ అవుతున్న ఇంపాక్ట్ రూల్‌పైనా అర్జున్ తన అభిప్రాయం షేర్ చేసుకున్నాడు. క్రికెట్ అనేది 11 మందికి చెందిన ఆటే అని, అది అంతమందితోనే ఆడాలని అన్నాడు. '11 మందిని ఎంపిక చేసుకొని వాళ్లతోనే గేమ్ ఆడాలి. ఎందుకంటే ఇంటర్నేషనల్ టీ20 లేదా ఏ లీగ్‌ల్లోను పరిశీలించినా అక్కడ ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన లేదు.



## అత్యంత చెత్త రికార్డును మూటగట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్..

పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఓ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా మంగళవారం గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ లాంగెస్ట్ ఓవర్ వేసి అందరిని ఆశ్చర్యపరిచాడు. గుజరాత్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. ఒక ఓవర్‌లో 6 బంతులు వేయాల్సి ఉండగా.. ఏకంగా 11 బంతులు వేసి చెత్త రికార్డును నమోదు చేశాడు.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 19 ఓవర్లు పూర్తయ్యే సరికి 6 వికెట్ల నష్టానికి 150 రన్స్ చేసింది. క్రీజులో షారుఖ్ ఖాన్, రాహుల్ తెవాటియా ఉండగా.. 20వ ఓవర్‌ను అర్ష్‌దీప్ సింగ్ వేశాడు. అయితే మొదటి బాల్‌ని వైడ్‌గా వేశాడు. ఆ తరువాత వరుసగా రెండు బాల్స్ వేయగా.. పరుగులు ఏమీ రాలేదు. అయితే.. మూడో బాల్‌కి రాహుల్ తెవాటియా ఫోర్ కొట్టడంతో అర్ష్‌దీప్ సింగ్ గతి తప్పాడు. ఇక ఫోర్త్ బాల్‌ని నో బాల్‌గా వేసిన అర్ష్‌దీప్ సింగ్.. ఆ తరువాత వరుసగా రెండు బాల్స్ వైడ్‌గా వేశాడు. నాలుగో బాల్‌కి పరుగులు రాలేదు. ఐదో బాల్‌కి సింగిల్ రాగా ఆఖరి బాల్‌ని వైడ్‌గా వేశాడు. మళ్లీ ఆరో బాల్ వేయగా ఈ సారి పరుగులు ఏమీ రాలేదు. ఓవర్ త్రోను కలుపుకుని మొత్తంగా ఈ ఓవర్‌లో 12 పరుగులు వచ్చాయి. అయితే ఐపీఎల్ చరిత్రలో ఇలా లాంగెస్ట్ ఓవర్‌ను వేసింది అర్ష్‌దీప్ సింగ్ ఒక్కడే కాదు. మరో ఐదుగురు బౌలర్లు ఉన్నారు. 2023లో మహ్మద్ సిరాజ్ ముంబై పై, 2023తో తుషార్ దేశ్ పాండే లక్నోపై, 2025లో శార్దూల్ ఠాకూర్ కేకేఆర్ పై, 2025లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై సందీప్ శర్మ, 2025లో గుజరాత్ టైటాన్స్‌పై హార్దిక్ పాండ్యాలు కూడా ఒక ఓవర్‌లో 11 బాల్స్ వేశారు. అర్ష్‌దీప్ సింగ్ చెత్త రికార్డును నమోదు చేసినప్పటికి కూడా పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

## అంతర్జాతీయ క్రికెట్ కంటే ఐపీఎల్ ఆడటం చాలా కష్టం

### కేకేఆర్ పేసర్, జింబాబ్వే స్టార్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరాబాని

అంతర్జాతీయ క్రికెట్ కంటే ఐపీఎల్ ఆడటం చాలా కష్టమైనదని కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) పేసర్, జింబాబ్వే స్టార్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరాబాని అన్నాడు. గతంలో ఆర్‌సీబీ జట్టులో ఉన్నప్పుడు ఐపీఎల్ గేమ్స్ ఎలా సాగుతుందో స్వయంగా చూశానని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న బ్లెస్సింగ్ ముజరాబాని తొలి మ్యాచ్‌లో అంచనాలను అందుకోలేకపోయాడు.బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో అతన్ని కేకేఆర్ తీసుకుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో జింబాబ్వే తరఫున 13 వికెట్లు పడగొట్టాడు. కానీ ముంబై ఇండియన్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 3 ఓవర్లు వేసిన ముజరాబాని 34 పరుగులిచ్చి ఒక్క వికెట్ తీయలేదు.తాజాగా అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడిన ముజరాబాని.. ఐపీఎల్ అత్యంత కఠినమైన టోర్నీ అని అభిప్రాయపడ్డాడు. ' ఈ సీజన్‌లో నేను మెరుగైన ప్రదర్శన చేయాలని భావిస్తున్నా. ఈ టోర్నీ ఆడటం నాకు చాలా ఇష్టం. ఈ టోర్నీ ఆడే సామర్థ్యం నాకు ఉంది. గతంలో ఆర్‌సీబీ జట్టులో భాగంగా ఉన్న నేను ఈ టోర్నీని నిశితంగా గనమించాను. అంతర్జాతీయ క్రికెట్ కంటే ఐపీఎల్ కష్టతరమైనది. గతేడాది ఆర్‌సీబీలో ఉన్నప్పుడు ఆట ఎలా సాగుతుందో నేను స్వయంగా చూశాను. ఈ ఏడాది.. నేను ఆ పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకుంటున్నా. మా కోచ్ డ్వేన్ బ్రావో ఇప్పటికే నాకు చాలా విషయాలు చెప్పాడు. నేను ఆడటం ప్రారంభించినప్పటి నుంచి, నా బౌలింగ్ గురించి, నాకు ఉండవలసిన నైపుణ్యాల గురించి, ముఖ్యంగా టీ20ల్లో ఎలా ప్రాక్టీస్ చేయాలి, టీ20 క్రికెట్‌ను ఎలా చూడాలి అనే విషయాలపై చాలా సమాచారం ఇచ్చారు. ఈ సీజన్ ముగిసే సమయానికి, నేను ఒక భిన్నమైన బౌలర్‌గా మారుతానని నమ్ముతున్నాను. భారత ఆటగాళ్లు చాలా కష్టపడతారు. నేను కూడా కష్టపడే స్వభావం కలవాడినే. కానీ వీరు కష్టపడే విధానం, విజయం కోసం వారు చూపే ఆరాటం నాకు సవాలుగా అనిపిస్తోంది. వారు నన్ను మరింత ముందుకు నడిపిస్తున్నారు'అని ముజరబానీ పేర్కొన్నారు.

## ఈ టోర్నీ కోసం మేమంతా ఉత్సాహంగా ఉన్నాం

### రిషభ్ పంత్ కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న తమ తొలి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ తెలిపాడు.'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇది తాజా వికెట్. రెడ్ సాయిల్ పిచ్ కావడంతో ఫాస్ట్ బౌలర్లకు ఏమైనా సహకరిస్తుందో లేదో చూడాలి. గణాంకాల ప్రకారం ఛేజింగ్ చేసే జట్లే ఇక్కడ గెలిచాయి. కానీ ఇది కొత్త టోర్నీ కాబట్టి ముందుగా బౌలింగ్ చేయడమే మంచిదని నేను భావిస్తున్నాను. గతేడాది మేం బాగానే ఆరంభించినప్పటికీ.. మధ్యలో పట్టు కోల్పోయాం. ఈసారి మళ్ళీ మంచి ఆరంభాన్ని కోరుకుంటున్నాం. మా విదేశీ ఆటగాళ్ల కాంబినేషన్‌లో ముగ్గురు బ్యాటర్లు మిల్లర్, నిస్సాంక, స్టబ్స్, ఒక బౌలర్‌గా లుంగి ఎన్గిడిని తీసుకున్నాం.'అని అక్షర్ పటేల్ చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ ఓడినా తమకు ఎలాంటి ఫరక్ పడదని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తెలిపాడు. ఇక్కడి పిచ్ ఏ మాత్రం మారదని, టాస్ ప్రభావం ఏ మాత్రం ఉండదని చెప్పాడు. 'ఈ పిచ్ ఏ మాత్రం మారదు. టాస్ గెలిచినా .. ఓడినా ఒక్కటే. సరికొత్త శక్తి, కొత్త లోగో, రంగు, కొత్త ఆలోచనా విధానంతో ఈ సీజన్ బరిలోకి దిగుతున్నాం.ఈ టోర్నీ కోసం మేమంతా ఉత్సాహంగా ఉన్నాం. గతేడాది గాయాలు మమ్మల్ని ఇబ్బంది పెట్టాయి. కానీ ఇప్పుడు వాటి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. బౌలర్లు అందరూ ఫిట్‌గా ఉన్నారు. ప్రతీ ఒక్కరూ మ్యాచ్‌పై ప్రభావం చూపడానికి సిద్ధంగా ఉన్నారు. మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, అన్రిచ్



నోకియాలను ఓవర్‌సీస్ ప్లేయర్లుగా బరిలోకి దించుతున్నాం.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు. లక్నో సూపర్ జెయింట్స్: ఎయిడెన్ మార్క్రామ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్/కెప్టెన్), ఆయుష్ బదోని, అబ్దుల్ సమద్, ముకుల్ చౌదరి, మొహ్సిన్ ఖాన్, మహమ్మద్ షమీ, అన్రిచ్ నోర్జే, ప్రిన్స్ యాదవ్.

ఢిల్లీ క్యాపిటల్స్: కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), పాతుమ్ నిస్సాంక, నితీష్ రాణా, అక్షర్ పటేల్ (కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ మిల్లర్, విప్రాజ్ నిగమ్, లుంగి ఎన్గిడి, కుల్దీప్ యాదవ్, టి. నటరాజన్, ముఖేష్ కుమార్.

# ఆంధ్రప్రదేశ్

## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

### బిల్లు తీసుకు రాబోతున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,ఏప్రిల్1 : సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## మార్కాపురం బస్సు ప్రమాదం కేసు

### డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి అరెస్ట్

మార్కాపురం,ఏప్రిల్1 : మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో డ్రైవర్ యువరాజు, బస్సు యజమాని హరికృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనమవగా.. మరో 28 మంది గాయపడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున మార్కాపురం మండలం రాయవరం సమీపంలో హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లో శ్రావణి ట్రావెల్స్ నడుపుతున్న యార్లగడ్డ కోటేశ్వరరావు వద్ద ంఫీ 20 ఆ 0487 నంబర్ బస్సును సెకండ్ హ్యాండ్‌గా కొనుగోలు చేసి హరికృష్ణారెడ్డి నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం సమయంలో బస్సులో సుమారు 35 నుంచి 41 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు యాంత్రిక లోపాలు కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి పరారీలో ఉండగా.. పోలీసులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 28 మంది ప్రయాణికులు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## చంద్రగిరి వద్ద కారులో మంటలు

### ప్రమాదం నుంచి తప్పించుకున్న ప్రయాణికులు

తిరుపతి,ఏప్రిల్1 : చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డులో పలువురు ప్రయాణికులకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. రన్నింగ్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వారంతా పరుగులు పెట్టారు. డ్రైవర్ అప్రమత్తతో ప్రాణాలు దక్కించుకున్నారు. తిరుపతి నుంచి పీలేరుకు కొంతమంది కారులో ప్రయాణిస్తున్నారు. చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డు వద్దకు రాగానే కారు ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగ రావడాన్ని డ్రైవర్ గమనించాడు. ప్రమాదం జరిగే అవకాశం ఉందన్న అనుమానంతో వెంటనే వాహనాన్ని ఆపేశాడు. కారులో ప్రయాణిస్తున్న వారిని అప్రమత్తం చేశాడు. వారంతా కారు నుంచి బయటకు దిగి పరుగులు తీశారు. క్షణాల్లోనే వాహనంలో మంటలు చెలరేగాయి. కారు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఇది చూసిన ప్రయాణికులు తృటిలో ప్రాణాలు దక్కించుకున్నామని ఊపిరి తీసుకున్నారు. తోటి వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు ప్రమాదం గురించి వివరాలను అడిగి తెలుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, మంటలు ఏ విధంగా చెలరేగాయనే అంశం పూర్తి విచారణలో తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

## ఐదుకోట్ల ఆంధ్రులు గర్వించే రోజు

### అమరావతికి లోక్‌సభ ఆమోదంపై లోకేశ్ ట్వీట్

అమరావతి,ఏప్రిల్1 : రాజధాని అమరావతి ప్రాంతంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అంటూ లోక్ సభ ఆమోదం తెలపడంతో సందడి మొదలైంది. వైసీపీ మినహా సభలోని అన్ని పార్టీలు రాజధానిగా అమరావతికే ఓటేశాయి. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించే చరిత్రాత్మక రోజు ఇదంటూ సంతోషం వ్యక్తం చేశారు. 'నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్– నా రాజధాని అమరావతి అని ఐదు కోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే చరిత్రాత్మకమైన రోజుకు దేశ పార్లమెంట్ వేదిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఒకే రాష్ట్రం– ఒకే రాజధాని నినాదంతో అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి చట్టబద్ధత కల్పించే అమరావతి బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించడం కోట్లాది ప్రజలు గర్వించదగ్గ సందర్భం. అమరావతి, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన పార్టీలకు కృతజ్ఞతలు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష. అమరావతి విజయం.. ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం. ఇది రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులు. శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితం. కోట్లాది ప్రజల కోరికను గౌరవించిన కేంద్రం ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా చరిత్ర–సంస్కృతికి ఆలవాలమైన అమరావతిని నిలిపింది. జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి..' అంటూ మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. ఏపీ రాజధాని అమరావతికి లోక్ సభ ఆమోదం తెలపడంతో ఢిల్లీకి మంత్రి లోకేశ్ వెళ్లనున్నారు. ఇవాళ రాత్రికి ఆయన దేశ రాజధానికి బయలుదేరనున్నారు. బిల్లుకు సహకరించిన ఎంపీలు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపనున్నారు. గురువారం నాడు రాజ్యసభలో బిల్లుపై చర్చ సమయంలో ఢిల్లీలోనే ఉండనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి: రామ్

హైదరాబాద్,ఏప్రిల్1 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# చంద్రబాబు కృషి వల్లనే అమరావతి సాకారం

### రైతుల పక్షాన చంద్రబాబుకు మంత్రి నారాయణ కృతజ్ఞతలు

### జగను కుతంత్రాలకు ఇక సాగవన్న మంత్రులు



అమరావతి,ఏప్రిల్1 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కృషి వల్లే రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందినందుకు ప్రధాని మోదీకి సైతం ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం రాజధాని బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంతో అమరావతిలో మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా పేరు పేరునా మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి అజేయం.. ఇకపై ఎవ్వరూ ఒక్క ఇంచు కూడా అమరావతిని కదల్చలేరని ధీమా వ్యక్తం చేశారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా ఐదేళ్లపాటు మూడు ముక్కలాట ఆడిందంటూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాష్ట్ర రాజధానిగా శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 14 వేల ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి ఆనం వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొలువుదీరిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీ చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ లబ్దిదారులకు నెలకు రూ.4 వేల చొప్పున నగదు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దొంగ నాటకాలను గుర్తించి.. తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. లోక్‌సభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో బుధవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఏపీ రాజధానిగా అమరావతిని రాష్ట్ర ప్రజలంతా ఆమోదించారన్నారు. 33 వేల ఎకరాల భూములను రైతులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఇచ్చారని తెలిపారు. ఆనాడు జగన్ అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మేము అనుకూలమని ప్రకటించారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కొల్లు రవీంద్ర తెలిపారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ చాలా ఘోరాలు, పాపాలు చేశారని వివరించారు. భూములు ఇచ్చిన రైతులు, మహిళలపై లాఠీఛార్జి చేయించారన్నారు. వారిపై అక్రమంగా కేసులు సైతం పెట్టించి జైలుకు పంపించారని చెప్పారు. చివరకు ఆ ప్రాంతంలో పరదాలు కట్టుకుని జగన్ వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. న్యాయస్థానం టూ దేవస్థానం అని మహిళలు చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని గుర్తు చేశారు. ఐదేళ్లలో అడుగు పని కూడా చేయకుండా జగన్.. అమరావతిని చంపేందుకు ఎన్నో కుట్రలు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అద్భుతమైన అమరావతి ఆవిష్కృతమవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉండేలా కట్టుదిట్టమైన చట్టం అవుతుందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి ఇప్పుడు పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని చెప్పారు. వైసీపీ నేతలు చేస్తున్న కుట్రలు, వారు చేసే వ్యాఖ్యలు దుర్మార్గంగా ఉన్నాయని మంత్రి రవీంద్ర తెలిపారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొని అభ్యంతరాలు ఎందుకు చెప్పలేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర సూటిగా ప్రశ్నించారు. మళ్లీ నేడు అమరావతిపై విషం చిమ్మేందుకు వైఎస్ జగన్ యత్నించారని విమర్శించారు. ఐదేళ్ల పాటు గడ్డి పీకాడా?.. ఇప్పుడు ఎలా ప్రశ్నిస్తారంటూ వైఎస్ జగన్‌పై ఆయన నిప్పులు చెరిగారు. కేంద్రం అందిస్తున్న సహకారంతో సీఎం చంద్రబాబు అమరావతిలో అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు. కేసుల భయంతో గత ఐదేళ్లుగా కేంద్రాన్ని నిధులు కూడా అడగలేక పోయారని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.

## అమరావతికి చట్టబద్ధత లభించడం సంతోషకరం

### జగన్ తీరుతో ఐదేళ్లు రాజధానికి అష్టకష్టాలు

### ఇప్పుడు కొత్తపల్లవి అందుకున్న జగన్ తీరు దారుణం

### మాజీమంత్రి సోమిరెడ్డి ఘాటు విమర్శలు



నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేస్తూ లోక్ సభ ఆమోదం తెలపడం సంతోషకర పరిణామమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రమంతా గర్వించేలా రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని తెలిపారు. అద్భుత రాజధాని నిర్మాణంతో సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి తన బ్రాండ్ చాటడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతి కోసం 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతుల త్యాగాన్ని రాష్ట్రం ఎప్పుడూ మరచిపోదని అన్నారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడిన వైసీపీ అధినేత జగన్ రెడ్డి డ్రామాలకు ఇప్పుడు చెక్ పడిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాలకు రాజధానులే ఉండవంటూ ఈరోజు మరో కొత్త రాగం అందుకున్నారని ఆయనపై నిప్పులు చెరిగారు సోమిరెడ్డి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులో పర్యటించిన సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. అమరావతే ఏపీ రాజధాని అంటూ ఏపీ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని లోక్ సభ ఆమోదించడం శుభపరిణామం. దేశంలోనే మొదటిసారిగా ల్యాండ్ పూలింగ్ విధానాన్ని అంగీకరించి 34 వేల ఎకరాలు ఇచ్చిన అమరావతి రైతుల మేలును రాష్ట్రం ఎప్పటికీ మరిచిపోదు. అమరావతికి చట్టబద్ధత లభించడంతో భూముల విలువ పెరిగి, పెట్టుబడులు వస్తాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరందుకుంటుంది. జగన్ మోహన్ రెడ్డి సృష్టించిన గందరగోళ వాతావరణానికి నేటితో తెరపడింది. 2019 ఎన్నికలకు ముందు రాజధాని అమరావతిలో తాను ఇల్లు కట్టుకుంటున్నానని ప్రజలను నమ్మించి అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారని మండిపడ్డారు.సీఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అని కూడా జగన్ సెలవిచ్చారు.. అంటే కర్ణాటక రాష్ట్రం యలహంకలోని 29 ఎకరాల ప్యాలెస్‌లో ఆయన ఉంటే అదే రాజధానిగా భావించాలేమో. హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో ఉంటే అదీ రాజధాని అనుకోవాలేమో. ఆయన బాత్రూమ్‌లో ఉంటే బాత్రూమ్, బెడ్రూమ్‌లో ఉంటే బెడ్రూమ్ రాజధాని అవుతుందా?. అని ఎద్దేవా చేశారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదమే లేదంటూ ఈరోజు మరో కొత్త రాగం అందుకున్నారు. ఎప్పుడు ఏ మాట్లాడుతారో తెలియదు. ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఎలా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. రాజధానికి స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులను అణచాలని జగన్ రెడ్డి ప్రయత్నించారు. రాజధాని అమరావతికి ఇప్పటికే 66 జాతీయ సంస్థలు వచ్చాయి. 60కి పైగా హైరేజ్ టవర్ల నిర్మాణం జరుగుతోంది. క్వాంటమ్ వ్యాలీ కూడా వచ్చింది. భవిష్యత్తులో రాష్ట్రమంతా గర్వించేలా అమరావతిని సీఎం చంద్రబాబు తీర్చిదిద్దడం ఖాయం' అని సోమిరెడ్డి అన్నారు.

## అమరావతికి చట్టబద్ధత ఐదుకోట్ల ఆంధ్రుల విజయం

### చంద్రబాబు దూరదృష్టి వల్లనే సాకారం

### అమరావతికి సహకరించిన మోడీ, అమిత్ షాలకు ధన్యవాదాలు

### ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ ట్వీట్

అమరావతి,ఏప్రిల్1 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలపడంతో ఏపీ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రజలంతా గర్వించే క్షణాలివని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుందని.. లోక్ సభలో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ ట్వీట్ చేశారు. అమరావతికి చట్టబద్ధత లభించడాన్ని జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలు బలమైన గుణపాఠం నేర్పిస్తారని మండిపడ్డారు. రాజధాని అమరావతికి తోడ్పాటును అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో.. అమరావతి ప్రజారాజధానిగా, భావితరాల అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'లోక్ సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందిన ఈ చారిత్రక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది పౌరులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. ఈరోజు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. అమరావతిని ఏపీ ఏకైక, శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ అమరావతి బిల్లు ఆమోదం పొందడం ప్రజా సంకల్పం, స్థైర్యం, ఆశయాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. రాజధానికి 33,000 ఎకరాలకు పైగా భూమిని అప్పగించి సాటిలేని త్యాగం చేసిన అమరావతి ప్రాంత రైతాంగానికి నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వారి చేసిన త్యాగం తరతరాలపాటు గుర్తుండిపోతుందని అన్నారు. అమరావతి నిర్మాణానికి పునాది వేసి అచంచలమైన నిబద్ధత కలిగిన సీఎం చంద్రబాబు దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఈ కలను సాకారం చేయడంలో నిరంతర మద్దతు అందించిన ప్రధాని మోదీ, ఎన్డీయే ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. గత ప్రభుత్వపు తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల తలెత్తిన సవాళ్ల సమయంలో రాష్ట్ర ప్రజలు అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. తమ ఆశయాలకు అనుగుణంగా స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రగతి, స్థిరత్వానికి అనుగుణమైన భవిష్యత్తును ఎంచుకున్నారు. పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల్లోనే కాకుండా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లో బలమైన నూతన విశ్వాసం చిగురించింది. 'స్వర్ణ ఆంధ్ర–2047' కలను సాకారం చేయడంలో అమరావతి కీలకపాత్ర పోషిస్తుందని, అలాగే ప్రధాని మోదీ 'వికసిత్ భారత్–2047' లక్ష్యానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందని దృఢంగా విశ్వసిస్తున్నా' అంటూ పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు

### పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ

న్యూఢిల్లీ,ఏప్రిల్1 : రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు. అంతర్జాతీయ ధరల ట్రెండ్‌ను ప్రస్తావిస్తూ, రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని, 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని, ఇప్పటికీ అదే అమల్లో ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందని, తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా చర్యలు తీసుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు చెప్పారు. పెట్రోల్, డీజిల్ తగినంతగా అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరారు. గృహావసరాలు, సీఎన్‌జీ ట్రాన్స్‌పోర్ట్‌కు 100 శాతం సరఫరాకు భరోసా ఇచ్చారు. విస్తరణ ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. మార్చిలో 3,25,000 కనెక్షన్లకు నేచురల్ గ్యాస్ సరఫరా చేశామని, 2,85,000 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 3,50,000 కొత్త వినియోగదారులు కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ఎల్పీజీకి సంబంధించి 60 శాతం దిగుమతులపై మనం ఆధారపడి ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు 522 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగిందన్నారు. అయినప్పటికీ డొమెస్టిక్ వినియోగదారుల ఎల్‌పీజీ సిలెండర్ల ధరలను పెంచలేదని చెప్పారు. ధరల్లో పెరుగుదల వల్ల తలెత్తిన నష్టాన్ని తట్టుకునేందుకు ఆయిల్ మా÷–గ్గ÷టింగ్ కంపెనీలకు ప్రభుత్వం సపోర్ట్ అందిస్తోందన్నారు. 2023లో ఓఎంసీలకు రూ.22,000 కోట్లు కేటాయించగా, 2025–26లో సుమారు రూ.30,000 కోట్లకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఏ ఒక్క గ్యాస్ ఏజెన్సీ నుంచి స్టాకు లేదనే సమాచారం లేదని, మంగళవారంనాడు కూడా 60 లక్షల సిలెండర్ల పంపిణీ జరిగిందని చెప్పారు.

## అమరావతికి చట్టబద్ధత హర్షణీయం

### ప్రధాని మోడీకి హోంమంత్రి అనిత కృతజ్ఞతలు


విశాఖపట్నం,ఏప్రిల్1 : అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు హోంమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది రైతుల త్యాగాలకు, శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితమన్నారు. అమరావతిని అంగుళం కూడా వేరొకరు కదిపే పరిస్థితి లేకుండా కట్టుదిట్టంగా చట్టాలు, శాసనాలతో ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వం సొంతమన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతిని పునఃప్రతిష్ఠించిన కేంద్ర ప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన అన్ని పక్షాలకు హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు.




## బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

### మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్- కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.



## 3కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసిన ధురంధర్-2

రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1400 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ.899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ.900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ.170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.





## విశ్రాంతి కోసం విదేశాలకు ప్రభాస్


టాలీవుడ్ డార్లింగ్, పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ వరుస షూటింగ్‌ల నుంచి చిన్న విరామం తీసుకున్నారు. ప్రభాస్ తన తదుపరి చిత్రాలపై మరింత జాగ్రత్తగా, పూర్తి ఫోకస్‌తో పని చేస్తున్నారు. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న డార్లింగ్, కొద్ది రోజులు విశ్రాంతి అవ్వడానికి వెకేషన్‌కు రెడీ అయ్యారు. నిర్విరామంగా షూటింగ్స్‌లో పాల్గొంటున్న ఈ పాన్ ఇండియా స్టార్, వేసవి సెలవుల కోసం ఇటలీకి బయలుదేరారు. తాజాగా బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఇటలీకి పయనమయ్యారు. అక్కడ కొద్ది రోజులు ప్రశాంతంగా గడిపిన తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. విరామం తర్వాత ఆయన నేరుగా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో బాక్సాఫీస్‌ను షేక్ చేసే రేంజ్‌లో ఉన్న సినిమాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫౌజీ అందులో ఒకటి. ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్న చిత్రం స్పిరిట్. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కల్కి సీక్వెల్ షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, ప్రభాస్ వెకేషన్ నుంచి రాగానే కీలక షెడ్యూల్స్ ప్రారంభం కానున్నాయని టాక్. బాక్సాఫీస్ వద్ద 'రాజా సాబ్' ఫలితం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినప్పటికీ, రాబోయే సినిమాల లైనప్ చూస్తుంటే డార్లింగ్ మళ్లీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



## సెట్స్‌లో నటి పట్ల అసభ్య ప్రవర్తన

### మళయాళ దర్శకుడు రంజిత్ అరెస్ట్

ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలపై కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక యువ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్నాకుళం సెంట్రల్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒక సినిమా సెట్‌లో రంజిత్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఇటీవల ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక విచారణ కోసం కొచ్చికి తరలించారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడానికి ముందు, చిత్ర యూనిట్‌లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు దానిని పరిశీలించి, అది తీవ్రమైన అంశంగా గుర్తించడంతో తదుపరి చర్యల కోసం కేసును కేరళ పోలీసులకు బదిలీ చేశారు. హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత మలయాళ సినీరంగంలో బయటపడుతున్న వరుస వేధింపుల కేసుల్లో ఇది మరొకటి కావడం గమనార్హం. గతంలోనూ రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. 2024లో బెంగాలీ నటి చేసిన వేధింపుల ఆరోపణల వల్ల ఆయన తన కేరళ చలనచిత్ర అకాడమీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పట్లో ఆ ఆరోపణలను రంజిత్ తోసిపుచ్చినప్పటికీ, తాజాగా మరో నటి ఫిర్యాదు చేయడంతో ఆయన చుట్టూ ఉచ్చు బిగిసినట్లయింది.




## రెండు భాగాలు కలిపి దురందర్ విడుదల

7.5 గంటల రన్‌టైమ్ అంటూ సోషల్ మీడియా పుకార్లు

రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ స్పై యాక్షన్ సిరీస్ 'ధురంధర్' గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సంచలన వార్త వైరల్ అవుతోంది. బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల రూపాయల వసూళ్లతో ప్రభంజనం సృష్టించిన 'ధురంధర్' (పార్ట్ 1), ఇటీవల విడుదలైన 'ధురంధర్: ది రివెంజ్' (పార్ట్ 2) చిత్రాలను కలిపి ఒకే భాగంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఎడిటింగ్‌లో తొలగించిన కీలక సన్నివేశాలతో పాటు పూర్తి నిడివి గల యాక్షన్ సీక్వెన్స్‌లను జోడించి ఏకంగా 7 గంటల 30 నిమిషాల సుదీర్ఘమైన ఎక్స్‌టెండెడ్ డైరెక్టర్స్ కట్ వెర్షన్‌గా దీనిని సిద్ధం చేస్తున్నారట. హాలీవుడ్ మార్వెల్ లేదా డీసీ సినిమాలకు ఇలాంటి భారీ డైరెక్టర్స్ కట్స్ రావడం మనం చూశాం కానీ, ఒక భారతీయ సినిమాకు ఈ స్థాయిలో 7.5 గంటల సుదీర్ఘమైన స్పెషల్ స్క్రీనింగ్ ప్లాన్ చేయడం ఇదే మొదటిసారి కానుంది. ఈ భారీ విజువల్ వండర్‌ను కేవలం ప్రీమియం థియేటర్ స్క్రీన్లలో మాత్రమే ప్రదర్శించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఏప్రిల్ 5 నుంచి ఈ వెర్షన్‌ను థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు సమాచారం.




## 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com